తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice
వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
24-09-2026
గురువారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 226
PUBLISHED FROM HYDERABAD
పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
సిరి
People's Voice
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575

## కాంగ్రెస్ పాలనలో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తం

- బొగ్గు కొరత.. ప్లాంట్ల మూత.. రైతులకు కష్టాలు
- జెన్‌కోకు సింగరేణి నాసిరకం బొగ్గు
- రూ.2,900 కోట్ల నష్టం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణ




3



# సర్కారు నిర్ణయంపై సంతృప్తి చెందిందెవరు?

## ఉద్యోగ సంఘాల నాయకులా.. ?ఉద్యోగులా..?

- పెండింగ్ డీఏలలో ఒక్కటిస్తేనే సంబరాలా అంటూ ఉద్యోగుల ఆగ్రహం
- ప్రభుత్వం ఇచ్చిందే గొప్ప అన్నట్లు ఉద్యోగ సంఘాల నేతలు
- పీఆర్సీ నివేదికను మళ్లీ వాయిదాల బాట పట్టించిన సర్కారు
- సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ విధానం అమలు ఊసేది?
- బకాయిలకు నెలకు రూ.1000 కోట్లతోనే సరిపెడతారా అంటూ నిలదీత
- ఉద్యోగుల హక్కులొస్తేనే ప్రభుత్వానికి ఖజానా కష్టాలు సాకులా?
- 2005 నియామకాలకు సంబంధించి ఓపీఎస్‌పై రాని స్పష్టత

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్**

తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం వాయిదాల బాట మాని చర్చలు సంపూర్ణం చేసినట్లు ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఉద్యోగ వర్గాల్లో తీవ్ర అసంతృప్తి రగులుతోంది. వాస్తవానికి ఉద్యోగులకు న్యాయబద్ధంగా రావాల్సిన పెండింగ్ డీఏలలో కనీసం సగం కూడా ఇవ్వకుండా కేవలం ఒకే ఒక్క డీఏ మంజూరు చేస్తే.. దానికి ఉద్యోగ సంఘాల నేతలు సంతృప్తి చెందటం ఇప్పుడు తెలంగాణలోని ఉద్యోగ వర్గాలకు తీవ్ర ఆగ్రహాన్ని తెప్పిస్తోంది. అసలు ఉద్యోగులు అడిగిందేంటి? సర్కారు ఇచ్చిందేంటి? ఏమిచ్చారని ప్రెస్‌మీట్లు పెట్టి సంబరాలు చేసుకుంటున్నారంటూ ఉద్యోగ సంఘాల నేతల తీరుపై సోషల్ మీడియా వేదికగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉద్యోగులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతం ఇవ్వడం తప్ప ఏమిచ్చిందని నిన్నటి వరకు విమర్శలు గుప్పించిన ఉద్యోగ సంఘాల నాయకులు..

మిగతా 2వ పేజీలో..

## మా భూముల హద్దులు నిర్ధారించాలి

- కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు రైతుల వినతిపత్రం
- కలకలం రేపుతోన్న ఎర్రవల్లి భూ సర్వే వివాదం

**మర్కుక్, సిరి న్యూస్ ,సెప్టెంబర్ 23 :**

సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలంలో భూ వివాదం కలకలం రేపుతోంది. అధికారులు ఇచ్చిన పట్టాదార్ పాస్ పుస్తకాల ప్రకారం కాకుండా వేరే సర్వే నంబర్ల పేరుతో వచ్చి భూములు కొలుస్తున్నారంటూ శివారు వెంకటాపూర్ గ్రామానికి చెందిన రైతులు

మిగతా 2వ పేజీలో..



## డ్రగ్స్‌పై పోరాటం ఇంటి నుంచే ప్రారంభం




- ప్రభుత్వం, పోలీసులకే బాధ్యత పరిమితం కాదు: గవర్నర్ శివప్రతాప్ శుక్లా
- కుటుంబాలు, విద్యాసంస్థలు, సమాజం కలిసి ఉద్యమంగా మార్చాలి
- విద్యార్థులతో యాంటీ డ్రగ్ ప్రతిజ్ఞ, డిక్లరేషన్‌కు సూచన
- వ్యసన బాధితులకు కౌన్సెలింగ్, పునరావాసం కల్పించాలి

3



## శిశువుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషి

- ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ ప్రకటన

2

## బీజేపీలో కీలక సంస్థాగత మార్పులు

- 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలకు ఇన్‌ఛార్జ్‌లు, సహ ఇన్‌ఛార్జ్‌లు
- తెలంగాణ, పశ్చిమ బెంగాల్‌కు సునీల్ బన్సల్
- హరియాణా, ఛత్తీస్‌గఢ్‌కు స్మృతి ఇరానీ
- తమిళనాడు, ఉత్తరాఖండ్ బాధ్యతలు రామ్ మాధవ్‌కు

3




## రైతు కన్నీటిలో ఓట్లు వెతకడమా?

- కరవుపై బీఆర్ఎస్ నీచ రాజకీయం
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ ఆగ్రహం
- నీటి కోసం కర్ణాటక సీఎంతో మంతనాలు... సానుకూలా స్పందన
- పంటను కాపాడతాం.. వేసవిలో నీటి ఎద్దడి రానివ్వం
- నేరేడుచర్లలో రూ.26.93 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం



**నేరేడుచర్ల, సిరి న్యూస్, సెప్టెంబర్ 23 :**

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న వేళ రైతులకు భరోసా కల్పించాల్సిన ప్రధాన ప్రతిపక్షం కరవు రావాలని, పంటలు ఎండిపోవాలని కోరుకుంటూ పైశాచికానందం పొందేందుకు ప్రయత్నిస్తోందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి బీఆర్ఎస్ పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రకృతి కారణంగా ఏర్పడిన వర్షపాత లోటును కూడా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంగా చిత్రీకరిస్తూ ఆ పార్టీ నేతలు చేస్తున్న దుష్ప్రచారాన్ని దుయ్యబట్టారు. రైతుల కష్టాన్ని రాజకీయ పెట్టుబడిగా మార్చుకోవడం బాధ్యతాయుతమైన

మిగతా 2వ పేజీలో..

## డిజిటల్ గవర్నెన్స్‌లో రోల్ మోడల్‌గా తెలంగాణ



- ఇంటి ముంగిటకే 'మీ సేవ' సేవలు
- తొలి దశలో 'క్యూర్' ప్రాంతాల్లో అమలు
- 'మీ సేవ డోర్ డెలివరీ సర్వీసెస్' ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు

3



## రెండు డీఏలు ఇచ్చేందుకు అంగీకారం

- ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి వెల్లడి

**హైదరాబాద్, సిరి న్యూస్, సెప్టెంబర్ 23 :**

రెండు డీఏలు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ప్రభుత్వ ప్రధాన

మిగతా 2వ పేజీలో..



2

## 25న గణేశ నిమజ్జనోత్సవం

## ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనాలు జరగాలి

- భారీ బందోబస్తు.. సమన్వయంతో ఏర్పాట్లు
- డీజేలు, బాణసంచాకు దూరంగా ఉండాలి



2

# అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు

హైదరాబాద్,సిరి న్యూస్, సెప్టెంబర్ 23: రాష్ట్రంలో మరో రెండు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రెడ్ అలర్ట్ జారీ చేసిన జిల్లాల కలెక్టర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వాగులు, చెరువులు, వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అవసరమైనచోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ప్రతి జిల్లాలో 24 గంటలూ అందుబాటులో ఉండే కంట్రోల్ రూమ్, టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి ప్రజలకు తక్షణ సహాయం అందించాలని కలెక్టర్లను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించేలా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, వాగులు, చెరువులు, వరద ప్రవాహ ప్రాంతాల వైపు వెళ్లవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు.

# శిశువుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

హైదరాబాద్సిరి న్యూస్, సెప్టెంబర్ 23 : ఆదిలాబాద్ రిమ్స్‌లో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో మృతి చెందిన పిల్లల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాను అందించనున్నట్టు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ బుధవారం ప్రకటించారు. ఆదిలాబాద్‌లోని వివిధ హాస్పిటళ్లలో చికిత్స పొందుతున్న శిశువుల ఆరోగ్య పరిస్థితిని మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైతే వారిని హైదరాబాద్‌లోని పెద్ద హాస్పిటల్స్‌కు తరలించి మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. రిమ్స్‌లో 150 బెడ్ల మాతా శిశు ఆరోగ్య కేంద్ర నిర్మాణానికి యుద్ధప్రాతిపదికన పనులు మొదలు పెట్టబోతున్నామని మంత్రి వెల్లడించారు. అత్యాధునిక వసతులతో ఎంసీహెచ్‌ను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కాగా, రివమ్స్‌లో జరిగిన అగ్నిప్రమాద ఘటనలో మృతిచెందిన శిశువల సంఖ్య 5కు చేరింది. మంగళవారం జరిగిన ప్రమాదంలో ముగ్గురు చనిపోగా చికిత్స పొందుతూ బుధవారం మరో ఇద్దరు మృతిచెందారు. మరో ఇద్దరు శిశువుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై విచారణకు ఇప్పటికే అయిదుగురు సభ్యులతో కూడిన కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

# రెండు డీఏలు ఇచ్చేందుకు అంగీకారం

మొదటిపేజీ తరువాయి

కార్యదర్శి సంజయ్ జాజు సచివాలయంలో బుధవారం సమావేశమయ్యారు. ఈ నెలాఖరు నాటికి పీఆర్‌సీ నివేదిక వచ్చే అవకాశం ఉందని సీఎస్ చెప్పినట్టు సమాచారం. సమావేశం అనంతరం ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ తాము మూడు డీఏలు ఇవ్వాలని అడిగామని, ప్రభుత్వం రెండు డీఏలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని చెప్పారు. 3.46 శాతంతో ఒక డీఏను ప్రభుత్వం ప్రకటించగా రెండో డీఏను 2.74 శాతంతో ఇచ్చేందుకు అంగీకారం తెలిపిందన్నారు. మూడో డీఏను మ□దునాలుగు నెలల్లో ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. 'పీఆర్‌సీ నివేదిక రాగానే చర్యలు తీసుకుంటామన్నారు.. సీపీఎస్ రద్దు చేసి, ఓపీఎస్ అమలు అధ్యయనానికి ఉద్యోగ సంఘాల నేతలు, అధికారులతో కమిటీ వేస్తామన్నారు.. కమిటీ వివిధ రాష్ట్రాల్లో పర్యటించి నివేదిక ఇవ్వనుంది అని ఉద్యోగ సంఘాల నేతలు వివరించారు. పీఆర్సీ కమిషన్ గడువును పొడిగించకుండా నివేదిక అందేలా చూడాలని ప్రభుత్వానికి ఉద్యోగ సంఘాలు విజ్ఞప్తి చేశాయి. డీఏ, పీఆర్సీ విషయంలో ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు.

# మా భూముల హద్దులు నిర్ధారించాలి

మొదటిపేజీ తరువాయి

తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాస్ పుస్తకాలు ఉన్న తమ భూములకు హద్దులు నిర్ధారించి న్యాయం చేయాలని కోరుతూ ఎంఆర్‌వో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం, రికార్డుల వ్యత్యాసం వల్ల దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న తమ భూములను కోల్పోవాల్సి వస్తోందని ఆరోపించారు. శివారు వెంకటాపుర్ గ్రామానికి చెందిన సర్వే నంబర్లు 41,85,88,77,100 లలో తమకు అధికారికంగా ధరణి పాస్ పుస్తకాలు, అలాగే పూర్వపు ఇందిరమ్మ పట్టాలు ఉన్నాయని రైతులు స్పష్టం చేశారు. కానీ అధికారులు ఎర్రవల్లి శివారుకు చెందిన సర్వే నంబర్ 325తో తమ భూములకు సంబంధం ముడిపెట్టి తమను వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారని వారు వాపోతున్నారు. ముందస్తు నోటీసులు లేకుండా వచ్చి సర్వే నిర్వహించడాన్ని సర్వే అధికారులను అడ్డుకుని నిరసన తెలిపారు. 'మాకు అధికారులే 41 సర్వే నంబర్ల పట్టా పాస్ పుస్తకాలు ఇచ్చారు.. మేము 41 లోనే వ్యవసాయం చేసుకుంటున్నాం.. ఇప్పుడు వచ్చి మమ్మల్ని వెళ్లగొట్టి కొలుస్తామంటే ఎట్లా.. సిఎం రేవంత్ రెడ్డి స్పందించి రికార్డుల ప్రకారం సర్వే చేయించి మాకు న్యాయం చేయాలని వేడుకుంటున్నాం' అన్నారు. సర్వే నంబర్లు 41, 85, 88, 77, 100 లను తీసుకెళ్లి 325 సర్వే నంబర్‌లో కలిపేశారు. గుర్రాల సూరయ్య, దర్శనాల చంద్రయ్య, కుమార్‌లకు ధరణి పాస్ పుస్తకాలు ఉన్నా కూడా మాకు నోటీసులు ఇవ్వకుండా కొలవడానికి వచ్చారన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శివారు వెంకటపూర్ రైతులు అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఎమ్మార్వో కార్యాలయంలో ఎమ్మార్వో సరితకు వినతి పత్రం అందజేశారు. వెంటనే చర్యలు తీసుకుని మా శివారు హద్దులు నిర్ధారించి మాకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

# 25న గణేశ నిమజ్జనోత్సవం

- **ఐదు జిల్లాలకు సెలవు ప్రకటించిన ప్రభుత్వం**

హైదరాబాద్ సిరి న్యూస్ , సెప్టెంబర్ 23 : వినాయక నిమజ్జనం సందర్భంగా ఈనెల 25న సెలవు ప్రకటిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం వినాయన నిమజ్జనాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ - సికింద్రాబాద్ జంట నగరాలతోపాటు రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలకు ప్రభుత్వం సాధారణ సెలవు ప్రకటించింది. ఈ సెలవుకు బదులుగా నవంబర్ 14న పని దినంగా పరిగణించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది



# సర్కారు నిర్ణయంపై సంతృప్తి చెందిందెవరు?

- **నాయకుల తీరుపై సోషల్ మీడియా వేదికగా ఉద్యోగుల పోరాటం**
- **విద్యుత్ ఉద్యోగులతో సఫలమైన ట్రాన్స్‌కో, జెన్‌కో యాజమాన్య చర్చలు**

మొదటిపేజీ తరువాయి



చర్చల అనంతరం ఒక్కసారిగా ఎందుకు మౌనం వహించారని, ఇచ్చిన అరకొర నిర్ణయాలకే ఎందుకు వత్తాసు పలుకుతున్నారని ఉద్యోగులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. గత కొద్ది నెలలుగా ఉద్యోగులు రోడ్డెక్కి చేస్తున్న పోరాటానికి దక్కిన ఫలితం ప్రస్తుతానికి ఒక్క డీఏ మాత్రమేనా అని నిలదీస్తున్నారు. ఇవ్వాల్సిన ఐదు డీఏలలో సర్కారు ఒక్కటి విదిలిస్తే.. దాన్ని ఉద్యోగులకు ఇస్తున్న గొప్ప వరంగా నేతలు చిత్రీకరించడం వెనుక ఆంతర్యమేమిటన్నది ఉద్యోగుల ప్రశ్న. తెలంగాణలోని లక్షలాది మంది ఉద్యోగులకు న్యాయంగా రావాల్సిన హక్కులను సాధించాల్సిన నాయకులకేమైందంటూ నెట్టింట పోస్టుల వర్షం కురిపిస్తున్నారు.

**ఒక్క డీఏతో సమస్య తీరినట్లేనా?**

తెలంగాణలోని లక్షలాది మంది ఉద్యోగులకు న్యాయంగా రావాల్సిన పీఆర్సీకి సంబంధించిన అంశంపై ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు తీవ్ర విమర్శలకు తావిస్తోంది. నెల రోజుల క్రితమే కమిటీ నివేదిక రాగానే పీఆర్సీపై స్పష్టమైన నిర్ణయం తీసుకుంటామని ప్రభుత్వం స్వయంగా చెప్పింది. అయితే ఒకవైపు ఆదేశాలు ఇస్తూనే, మరోవైపు ఆ కమిటీ నివేదిక బయటకు రాకపోవడానికి ప్రభుత్వ ఉదాసీనతే కారణమన్న విమర్శలు ఉద్యోగ వర్గాల నుంచి బలంగా వినిపిస్తున్నాయి. ఆ ఆరోపణలకు బలాన్ని చేకూరుస్తూ తాజా చర్చల్లోనూ పీఆర్సీ అంశాన్ని మరోసారి వాయిదా వేయడం దేనికి సంకేతమని ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఒక అధికారిక కమిటీ ఇచ్చే నివేదికకు నిర్దిష్టమైన కాలపరిమితి ఉండదా? లక్షలాది సామాన్య ఉద్యోగుల సహజమైన వేతన సవరణ హక్కులను నెరవేర్చేందుకు ఈ కాలయాపన ఎందుకు? ఒకవైపు ప్రభుత్వ ధోరణి దాటవేతగా ఉంటే, పాలకులు చెప్పిన ప్రతిదానికీ ఉద్యోగ సంఘాలు ఎలా ఆమోదం తెలుపుతాయన్నది ఉద్యోగుల ప్రశ్నగా మారింది. ఒకవేళ నిజంగా అడిగిన డిమాండ్లలో కనీసం పెండింగ్ డీఏలన్నీ మంజూరైనా హర్షించవచ్చు.. కానీ అందులో ఒకే ఒక్క డీఏ మాత్రమే తక్షణం లభించే పరిస్థితి ఉంది. మరి అలాంటప్పుడు పీఆర్సీని వాయిదా వేయించుకుని ఉద్యోగుల కోర్కెలను పక్కనపెట్టిన సంఘాల నేతల తీరు క్షమార్హం కాదంటూ ఉద్యోగులు విరుచుకుపడుతున్నారు.

**w2005 నియామకాలకు ఓపీఎస్‌పై రాని స్పష్టత**

పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీవ్రమైన ఆర్థిక భారం ఉన్నప్పటికీ, ఉద్యోగులకు ఇచ్చిన వాగ్దానానికి కట్టుబడి జీపీఎస్/ఓపీఎస్ తరహా వెసులుబాట్లతో పాటు ముఖ్యంగా 2005 నోటిఫికేషన్ ద్వారా నియామకమైన ఉద్యోగులకు పాత పింఛన్ విధానాన్ని అమలు పరిచింది. అదే తరహా విధానాన్ని తెలంగాణలోనూ 2005 ఉద్యోగులకు వర్తింపజేయాలని ఉద్యోగ సంఘాలు కోరినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం అందుకు సంబంధించి ఎలాంటి స్పష్టమైన హామీ ఇవ్వలేకపోయింది. చర్చల్లో ఎలాంటి నిర్మాణాత్మక పరిష్కారం లభించనప్పటికీ, కొందరు సంఘ నాయకులు బయటకు వచ్చి ప్రెస్‌మీట్ పెట్టి మరీ పరస్పరం అభినందనలు తెలుపుకుంటూ సంతోషం వ్యక్తం చేయడం లక్షలాది మంది సాధారణ ఉద్యోగుల నిరసనకు కారణమవుతోంది. ఏది ఏమైనా సర్కారు అరకొర హామీలకు ఏమాత్రం సంతృప్తి చెందని సగటు ఉద్యోగులంతా ఏకమైతే.. ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్న ఉద్యోగ సంఘాల నేతల పరిస్థితి ఏంటన్న చర్చ ఇప్పుడు సర్వత్రా మొదలైంది.

**విద్యుత్ ఉద్యోగులతో**
**ఫలించిన యాజమాన్య చర్చలు..**

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో జరిపిన చర్చల్లో సింగిల్ డీఏ అమలుతోనే సరిపెట్టగా.. విద్యుత్ ఉద్యోగులతో విద్యుత్ సంస్థల యాజమాన్యం జరిపిన చర్చల్లో చాలావరకు సానుకూల ఫలితాలు వెలువడ్డాయి. విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్లు, పెన్షనర్ల సమస్యలపై యాజమాన్యంతో సానుకూల వాతావరణంలో చర్చలు కొనసాగాయి. బుధవారం విద్యుత్ సౌధ కేంద్రంగా జరిగిన ఈ కీలక సమావేశంలో ట్రాన్స్‌కో, డిస్కమ్‌లు, జెన్‌కోల సీఎండీలతో పాటు పవర్ జేఏసీ నేతలు పాల్గొన్నారు. ఉద్యోగుల సమస్యలను యాజమాన్యం నిశితంగా పరిశీలించి, పలు ప్రధానాంశాలపై స్పష్టత ఇవ్వడంతో పాటు సమస్యల పరిష్కారానికి తదుపరి కార్యాచరణ చేపడతామని హామీ ఇచ్చింది.

**చర్చల్లో ప్రధానంగా ప్రస్తావించిన అంశాలు**

పీఆర్సీ కమిటీ ఏర్పాటు..విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్లు మరియు పెన్షనర్ల వేతన సవరణకు సంబంధించి ప్రత్యేక పీఆర్సీ కమిటీ ఏర్పాటు ప్రక్రియను త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని యాజమాన్యం స్పష్టం చేసింది.

**ఆర్టిజన్ల హక్కులు, ప్రయోజనాలు..**

ఆర్టిజన్ల ప్రధాన డిమాండ్లలో భాగంగా, రెగ్యులర్ ఉద్యోగులకు ఏ విధంగా అయితే అన్ని రకాల సెలవులు, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, మెడికల్ బెనిఫిట్స్ తదితర ప్రయోజనాలు అందుతున్నాయో, అదే రీతిలో ఆర్టిజన్లకు కూడా అన్ని ప్రయోజనాలు కల్పించే అంశంపై యాజమాన్యం సానుకూలంగా స్పందించి అధికారికంగా అంగీకారం తెలిపింది.

**ఏపీఎస్‌ఈబీ సర్వీస్ రూల్స్..**

ఏపీఎస్‌ఈబీ సర్వీస్ రూల్స్ అమలుకు సంబంధించి న్యాయ నిపుణుల సలహా తీసుకున్న అనంతరం, వాటిని ఏ విధంగా అమలు చేయాలనే దానిపై తగిన నిర్ణయం తీసుకుంటామని యాజమాన్యం వెల్లడించింది.

**ఈపీఎఫ్ ఉద్యోగులకు మెడికల్ బెనిఫిట్..**

ఈపీఎఫ్ పరిధిలోని ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం మెడికల్ బెనిఫిట్ కల్పించే అంశంపై యాజమాన్యం సానుకూలంగా స్పందించి, ఆ దిశగా అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది.

**ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్ మార్పు..**

ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్‌కు మార్పు చేసే కీలక అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సాధ్యాసాధ్యాలను సమగ్రంగా పరిశీలించిన అనంతరం తదుపరి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది.

**బదిలీ మార్గదర్శకాలు, పదోన్నతులు, రిక్రూట్‌మెంట్..**

విద్యుత్ సంస్థల్లో ఉద్యోగుల జనరల్ ట్రాన్స్‌ఫర్ గైడ్‌లైన్స్‌ను రాబోయే 15 రోజుల్లో జారీ చేసేలా చర్యలు తీసుకుంటామని, పెండింగ్‌లో ఉన్న రెగ్యులర్ పదోన్నతులను రెండు నెలల్లో చేపడతామని హామీ ఇచ్చారు. అలాగే ఆర్పీడీసీఎల్ అంశంపై గతంలో మాదిరిగానే ట్రైపార్టీ అగ్రిమెంట్ చేయడం, కొత్త పోస్టుల మంజూరుపై ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. అన్నింటికీ మించి అన్ని విద్యుత్ సంస్థల్లోని వివిధ క్యాడర్లలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి త్వరలోనే ఉద్యోగ రిక్రూట్‌మెంట్ ప్రక్రియ ప్రారంభిస్తామని యాజమాన్యం ప్రకటించడంతో విద్యుత్ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

### రూ.10 వేల కోట్ల బకాయిలు అడిగితే ఆర్థిక కారణాల సాకులా?

తెలంగాణలోని ఉద్యోగులు, రిటైర్డ్ పెన్షనర్లకు సంబంధించి మెడికల్ రీయింబర్స్‌మెంట్లు, జీపీఎఫ్, సరెండర్ లీవులు తదితర రూపాల్లో దాదాపు రూ.10 వేల కోట్ల బిల్లుల బకాయిలు ప్రభుత్వ ఖజానా వద్ద ఏళ్ల తరబడి పేరుకుపోయాయి. ఈ బకాయిల చెల్లింపు విషయంలోనూ సర్కారు పాత పద్ధతినే కొనసాగించేందుకు ప్రయత్నించడంపై ఉద్యోగులు తీవ్రంగా మండిపడుతున్నారు. పెండింగ్ బిల్లులను క్లియర్ చేసేందుకు కనీసం నెలకు రూ.2 వేల కోట్ల చొప్పున విడుదల చేయాలని ఉద్యోగ సంఘాలు చర్చల్లో డిమాండ్ చేశాయి. కానీ ప్రభుత్వం మాత్రం నెలకు కేవలం రూ.1000 కోట్లే ఇస్తామని తెల్చిచెప్పడం కొసమెరుపు. ఇందుకు కారణంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదనడం ఉద్యోగుల ఆగ్రహాన్ని రెట్టింపు చేస్తోంది. ఇతర అభివృద్ధి పనులకు, కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపులకు, ప్రాధాన్యేతర మంజూరీలకు వేల కోట్ల రూపాయల నిధులు ఇస్తున్నప్పుడు.. ఒక్క ఉద్యోగుల విషయానికి రాగానే ఖజానా కష్టాలు, నిధుల కొరత అంటూ సాకులు చెప్పడం ఎంతవరకు న్యాయమని ఉద్యోగులు ప్రశ్నిస్తుంటే, సంఘాల నేతలు మాత్రం మాట్లాడకుండా నోరు మెదపకపోవడం వెనుక ఉన్న అసలు మతలబేమిటంటూ ఉద్యోగులు నిప్పులు చెరుగుతున్నారు.

### ఓపీఎస్ పునరుద్ధరణపై ఎన్నేళ్లీ జాప్యం?

తెలంగాణ ఉద్యోగులకు సంబంధించి ప్రభుత్వానికి సమర్పించిన డిమాండ్ల మెమొరాండంలో అత్యంత ప్రధానమైన అంశం సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడం. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తమ ఎన్నికల ప్రణాళికలో ఉద్యోగులకు ఇచ్చిన కీలక వాగ్దానం కూడా ఇదే. ఉద్యోగుల సానుకూల సర్కారంటూ ప్రచారం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న పాలకులు.. తాము అధికారంలోకి రాగానే అమలు చేస్తామని మాటిచ్చిన ఈ ప్రధాన హామీని ఎందుకు అమలు చేయడం లేదన్నది ఉద్యోగుల సూటి ప్రశ్న. పదవీ విరమణ తర్వాత ఉద్యోగి భవిష్యత్తుకు భద్రతనిచ్చే పాత పింఛన్ పునరుద్ధరణ విషయంలోనైనా ఉద్యోగ సంఘాల నేతలు ప్రభుత్వంతో రాజీలేని పోరాటం చేయకుండా, ప్రభుత్వం ఇచ్చిందే పుచ్చుకునే లొంగుబాటు ధోరణిని ఎందుకు ప్రదర్శిస్తున్నారని ఉద్యోగ లోకం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

# ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనాలు జరగాలి

- **భారీ బందోబస్తు.. సమన్వయంతో ఏర్పాట్లు**
- **డీజేలు, బాణసంచాకు దూరంగా ఉండాలి**
- **ఉత్సవ కమిటీలకు సూచించిన డీజీపీ**

హైదరాబాద్, సిరి న్యూస్, సెప్టెంబర్ 23 : గణేష్ నిమజ్జనాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేసినట్లు డీజీపీ సి.వి.ఆనంద్ తెలిపారు. ఖైరతాబాద్ మహాగణపతిని బుధవారం దర్శించుకున్న ఆయన రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, గణనాథుడి ఆశీస్సులు అందరికీ లభించాలని ఆకాంక్షించారు. సెంట్రల్ జోన్ డీసీపీగా పనిచేసినప్పటి నుంచి ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలతో తనకు 13 ఏళ్ల అనుబంధం ఉందని డీజీపీ గుర్తు చేశారు. నాడు సుదర్శన్, ఇప్పుడు వారి కొడుకులు సందీప్, రాజ్ కుమార్, కూతురు వీణ, మహేష్‌యాదవ్, ఇతర సభ్యులు శాంతియుతంగా నిమజ్జనాలు చెయ్యడానికి చాలా సహకరిస్తారని తెలిపారు. ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులతోపాటు పోలీసు, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పది రోజుల గణేష్ ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయని డీజీపీ తెలిపారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో నిమజ్జనాలు జరుగుతున్నాయని,



రేపు, ఎల్లుండి భారీ సంఖ్యలో నిమజ్జనాలు జరిగే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లోనూ సీపీలు, ఎస్పీలు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో సుమారు 30 వేల మంది పోలీసులను బందోబస్తు కోసం మోహరించినట్లు వెల్లడించారు. నిమజ్జనాల కోసం జీహెచ్‌ఎంసీ, విద్యుత్, జలవనరులు, ఇతర ప్రభుత్వ శాఖలతో పోలీసు శాఖ సమన్వయంతో పనిచేస్తోందని తెలిపారు. హుస్సేన్‌సాగర్‌తో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిమజ్జన ఏర్పాట్లు పూర్తిచేశామని చెప్పారు. ట్యాంక్‌బండ్‌పై అవసరమైనచోట్ల క్రేన్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నిమజ్జన ఊరేగింపు మార్గాల్లో చోరీలు, మహిళల పట్ల వేధింపులు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు డీజీపీ తెలిపారు. షీ టీమ్స్, టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దింపామని, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ విభాగాలు సమన్వయంతో పని చేస్తున్నాయని చెప్పారు. నిమజ్జన ఊరేగింపుల్లో డీజేలు, బాణసంచా వినియోగంపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలు అమల్లో ఉన్నాయని గుర్తుచేశారు.

# రైతు కన్నీటిలో ఓట్లు వెతకడమా?

మొదటిపేజీ తరువాయి

ప్రతిపక్ష లక్షణం కాదని మండిపడ్డారు. నేరేడుచర్ల మండలం మేడారం గ్రామంలో రూ.26.40 కోట్లతో నిర్మించిన నేరేడుచర్లదూపాడు డబుల్ రోడ్డును మంత్రి ఉత్తమ్ బుధవారం ప్రారంభించారు. రూ.20 లక్షలతో నిర్మించిన జానల్‌దిన్నె గ్రామ పంచాయతీ భవనం, రూ.33 లక్షలతో నిర్మించిన నేరేడుచర్ల గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించారు. మొత్తం రూ.26.93 కోట్ల అభివృద్ధి పనులను ప్రజలకు అంకితం చేశారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ ఎల్‌నినో అనేది ప్రపంచవ్యాప్తంగా వాతావరణాన్ని ప్రభావితం చేసే శాస్త్రీయ పరిణామం.. భారత రుతుపవనాలపైనా దాని ప్రభావం పడుతుంది.. ఈసారి వర్షపాతం దాదాపు 40 శాతం తగ్గింది.. ఈ వాస్తవాన్ని దాచిపెట్టి ప్రభుత్వంపై విషప్రచారం చేయడం బీఆర్‌ఎస్ రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనం అని విమర్శించారు. పొలంలో పంట ఎండిపోతే ప్రభుత్వానికి బాధ కలుగుతుంది.. బీఆర్‌ఎస్‌కు మాత్రం రాజకీయ అవకాశం కనిపిస్తోంది. రైతు కన్నీటిలో ఓట్లు వెతకడం కంటే నీచమైన రాజకీయం మరొకటి ఉండదు అంటూ విరుచుకుపడ్డారు. అందుబాటులో ఉన్న ప్రతి నీటి చుక్కనూ కాపాడి ప్రజల అవసరాలకు వినియోగించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. పంటలను కాపాడడం, రాబోయే వేసవిలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా చూసేందుకు ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలతో పనిచేస్తోందన్నారు. సమస్య వచ్చినప్పుడు పరిష్కారాన్ని వెతికేది కాంగ్రెస్ ప్రభుత్వం.. సమస్య మరింత పెరగాలని కోరుకునేది బీఆర్ఎస్.. తాము రైతు పంటను కాపాడేందుకు నీళ్ల కోసం రాష్ట్రాల తలుపులు తడుతున్నాం అని చెప్పారు. జూరాల ఆయకట్టు కింద పంటలను కాపాడేందుకు కర్ణాటక నుంచి నీటిని విడుదల చేయించే అంశంపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్‌తో మంతనాలు జరిపినట్లు ఉత్తమ్ వెల్లడించారు. తనకున్న వ్యక్తిగత స్నేహాన్ని రాష్ట్ర రైతుల ప్రయోజనాల కోసం వినియోగించానని చెప్పారు. రాష్ట్ర విజ్ఞప్తికి డీకే సానుకూలంగా స్పందించారని, నీటి లభ్యతను పరిశీలించి సహకరించేందుకు హామీ ఇచ్చారని వివరించారు. 'మేం కర్ణాటకతో మాట్లాడి నీళ్లు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం.. బీఆర్ఎస్ నేతలు మాత్రం రైతుల్లో భయం సృష్టిస్తున్నారు.. మాకు రాజకీయాల కంటే పంటలు ముఖ్యం.. ప్రచారం కంటే ప్రజల ప్రాణాలు ముఖ్యం' అని మంత్రి స్పష్టం చేశారు. ప్రకృతిని శాసించలేము.. కానీ ప్రజలను కాపాడే బాధ్యత నుంచి ఒక్క అడుగు కూడా వెనక్కి వెళ్లం' అని ప్రకటించారు. ప్రజల అవసరాలకనుగుణంగా మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంతో తనకు ఉన్నది రాజకీయ సంబంధమే కాదు.. ప్రజలతో పెనవేసుకున్న ఆత్మీయ అనుబంధం.. మీ శ్రమ, ప్రేమ, ఆదరాభిమానాలతోనే ఆరుసార్లు శాసనసభకు, ఒకసారి లోక్‌సభకు ఎన్నికయ్యాను.. మీ రుణాన్ని అభివృద్ధితోనే తీర్చుకుంటా' అని చెప్పారు. పార్టీకి కార్యకర్తలు, నాయకులే వెన్నెముక అని మంత్రి అన్నారు. వారి కృషి, ప్రజల విశ్వాసంతోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. కోదాడ మెగా జాబ్ మేళా విజయవంతం కావడం ఈ ప్రాంత యువతపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని చెప్పారు. రోడ్లు, భవనాలు నిర్మించడం అభివృద్ధిలో ఒక భాగం.. కానీ ఒక యువకుడికి ఉద్యోగం వచ్చి అతని కుటుంబంలో వెలుగు నిండితే అంతకంటే గొప్ప సంతృప్తి మరొకటి ఉండదు.. కోదాడ మెగా జాబ్ మేళా విజయం ప్రజల ప్రభుత్వం ఏ విధంగా పనిచేస్తుందో నిరూపించింది అని ఉత్తమ్ అన్నారు. ప్రజా సంక్షేమం, రైతుల రక్షణ, యువతకు ఉపాధి, గ్రామాల సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు.

# కాంగ్రెస్ పాలనలో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తం

హైదరాబాద్, సిరి న్యూస్ , సెప్టెంబరు 23 :

రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభం నెలకొనడానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యం, విద్యుత్ రంగంలో మిస్ మేనేజ్‌మెంట్, సింగరేణి-జెన్‌కో మధ్య ఆర్థిక వ్యవహారాల్లో గందరగోళమేనని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న సమయంలో థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో బొగ్గు కొరతతో ఉత్పత్తి పడిపోతున్నదని, మరోవైపు జల విద్యుత్ కేంద్రాలు కూడా నీటి లభ్యత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఈ పరిస్థితులపై వాస్తవాలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు ఆరు బీఆర్‌ఎస్ బృందాలు రాష్ట్రంలోని థర్మల్ పవర్ ప్లాంట్లు, సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని గురువారం సందర్శించనున్నాయని వెల్లడించారు. తెలంగాణ భవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ..తెలంగాణ ప్రజలకు కరెంట్ విలాస వస్తువు కాదని, జీవన రేఖ అని అన్నారు. వ్యవసాయం, సాగు, తాగునీరు, పరిశ్రమలు, ఐటీ రంగం, గృహ అవసరాలు అన్నింటికీ విద్యుత్ అత్యంత కీలకమని చెప్పారు. విద్యుత్ సమస్యపైనే తెలంగాణ మలి దశ ఉద్యమానికి పునాది పడిందని గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పడే నాటికి రాష్ట్రంలో 7,778 మెగావాట్ల స్థాపిత విద్యుత్ సామర్థ్యం ఉండగా బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న పదేండ్లలో దాన్ని 19,472 మెగావాట్లకు పెంచామని కేటీఆర్ తెలిపారు. విద్యుత్ రంగంలో దాదాపు రూ.లక్ష కోట్లు పెట్టుబడి పెట్టామని చెప్పారు. 400 కేవీ సబ్‌స్టేషన్లను 28కు, 220 కేవీ సబ్‌స్టేషన్లను 51 నుంచి 103కు పెంచినట్టు వివరించారు. దాదాపు 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించామన్నారు. అప్పట్లో దేశంలోనే అత్యధిక ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ సాధించిన విద్యుత్ కేంద్రాల్లో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ కూడా ఒకటని కేటీఆర్ చెప్పారు. సింగరేణి విద్యుత్ కేంద్రం సుమారు 91 శాతం పీఎల్ఎఫ్‌తో పనిచేసిందని తెలిపారు. ప్రస్తుతం అదే సంస్థ, అదే విద్యుత్ వ్యవస్థ ఇబ్బందుల్లోకి వెళ్లిందని ఆరోపించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రైతులకు ఆరు గంటలకు మించి కరెంట్ సరఫరా కావడం లేదన్నారు. ప్రభుత్వం 24 గంటల విద్యుత్ ఇస్తున్నామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందన్నారు. సబ్‌స్టేషన్ల వద్ద రైతుల ధర్నాలు, రాస్తారోకోలు జరుగుతున్నాయని చెప్పారు. విద్యుత్ కోతల ప్రభావం వ్యవసాయ రంగానికే పరిమితం కావడం లేదని, పరిశ్రమలు కూడా ప్రత్యామ్నాయ వనరులపై ఆధారపడుతున్నాయని తెలిపారు. దీనివల్ల పరిశ్రమల నిర్వహణ వ్యయం పెరిగే పరిస్థితి ఏర్పడుతున్నదన్నారు.

**80ల నాటి పరిస్థితులు**

సోషల్ మీడియాలో '80స్ ట్రెండ్' నడుస్తున్న సమయంలో తెలంగాణలో మాత్రం 1980ల నాటి విద్యుత్ పరిస్థితులు తిరిగి వచ్చాయని కేటీఆర్ వ్యాఖ్యానించారు. అప్పట్లో రైతులు విద్యుత్ కోసం పడిన ఇబ్బందులు ఇప్పుడు మళ్లీ కనిపిస్తున్నాయన్నారు. విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోయే పరిస్థితి, క్రాప్ హాలిడే ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నదని ఆరోపించారు. రానున్న వేసవిలో పరిస్థితి మరింత తీవ్రమైతే తాగునీరు, యాసంగి పంటలు, పరిశ్రమలకు విద్యుత్ సరఫరా వంటి అంశాలపై ప్రభుత్వం ఏం ప్రణాళికతో ముందుకెళ్తున్నదో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న సమయంలో ఉత్పత్తి కేంద్రాలు వరుసగా నిలిచిపోవడంపై ప్రశ్నలు సంధించారు. 4,000 మెగావాట్ల సామర్థ్యం ఉన్న యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో సుమారు 400 మెగావాట్లే ఉత్పత్తి అవుతున్నదని తెలిపారు. భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో 270 మెగావాట్ల సామర్థ్యం ఉన్న యూనిట్ నిలిచిపోయిందన్నారు. జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ 1,200 మెగావాట్ల సామర్థ్యం కలిగి ఉండగా సుమారు 544 మెగావాట్ల స్థాయిలోనే ఉత్పత్తి జరుగుతున్నదని చెప్పారు. పలు థర్మల్ యూనిట్లలో బొగ్గు కొరతతో ఉత్పత్తి ప్రభావితమైందని ఆరోపించారు.

**'ఎల్‌నినో కాదు.. ఎల్ కాంగో'**

విద్యుత్ సంక్షోభానికి ఎల్‌నినో ప్రభావమే కారణమన్న వివరణను కేటీఆర్ తిరస్కరించారు. 'ఇది ఎల్‌నినో కాదు.. ఎల్ కాంగో' అంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. విద్యుత్ సంక్షోభానికి ప్రధాన కారణాల్లో సింగరేణి బొగ్గు సరఫరా వ్యవస్థ కూడా ఒకటని కేటీఆర్ ఆరోపించారు. జెన్‌కోకు నాణ్యమైన బొగ్గు అందించాల్సిన సింగరేణి తక్కువ నాణ్యత కలిగిన జీ13, జీ14 గ్రేడ్ బొగ్గును సరఫరా చేస్తున్నదన్నారు. నాసిరకం బొగ్గు వినియోగంతో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం తగ్గడంతో రూ.2,900 కోట్ల ప్రజాధనం నష్టపోయిందని చెప్పారు. సింగరేణి నుంచి 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందంటూ దీనిలో సుమారు రూ.1,600 కోట్ల మేర అక్రమాలు జరిగాయన్న తమ పార్టీ ఆరోపణలను మరోసారి ప్రస్తావించారు. బొగ్గు నిల్వలు అందుబాటులో ఉంటే థర్మల్ పవర్ ప్లాంట్లు ఎందుకు నిలిచిపోతున్నాయని ప్రశ్నించారు. సింగరేణి నుంచి జెన్‌కోకు బొగ్గు సరఫరా, జెన్‌కో నుంచి సింగరేణికి రావాల్సిన బకాయిల వ్యవహారంపై కూడా ప్రశ్నలు లేవనెత్తారు. సింగరేణికి ప్రభుత్వం నుంచి సుమారు రూ.52 వేల కోట్ల బకాయిలు రావాల్సి ఉందని తెలిపారు. బకాయిల చెల్లింపులు నిలిచిపోవడం సంస్థ కార్యకలాపాలపై ప్రభావం చూపుతున్నదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి సంస్థతో ఫుట్‌బాల్ ఆట ఆడుతున్నదని కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. సింగరేణి కార్మికులు, రైతులు, పరిశ్రమలు, ఐటీ పార్కుల భవిష్యత్తుతో ఆటలాడే పరిస్థితి రావద్దన్నారు. బొగ్గు ఉత్పత్తి, సరఫరా, ఆర్థిక వ్యవహారాలు, పవర్ ప్లాంట్ల నిర్వహణపై ప్రభుత్వం సమగ్రంగా దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో 'గ్రాస్ మిస్ మేనేజ్‌మెంట్ ఆఫ్ రిసోర్సెస్, గ్రాస్ మిస్ మేనేజ్‌మెంట్ ఆఫ్ ఫైనాన్సెస్, గ్రాస్ మిస్ మేనేజ్‌మెంట్ ఆఫ్ నేచురల్ రిసోర్సెస్' జరుగుతున్నట్లు కేటీఆర్ ఆరోపించారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి 202324లో 70 మిలియన్ టన్నుల నుంచి 202526లో 58 మిలియన్ టన్నులకు పడిపోయిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ గణాంకాల ఆధారంగా సంస్థ పనితీరుపై ప్రభుత్వం సమగ్ర వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయింది**

రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభానికి ప్రకృతి పరిస్థితులే కారణం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యం, చేతకానితనం, మిస్ మేనేజ్‌మెంట్, కమీషన్లు, అవినీతి కారణమని కేటీఆర్ ఆరోపించారు. గత ప్రభుత్వం నిర్మించిన విద్యుత్ మౌలిక వసతులను సరిగా నిర్వహించకుండా ఉన్న వ్యవస్థను నాశనం చేసి, చిన్నాభిన్నం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయింది అని వ్యాఖ్యానించిన కేటీఆర్ ఎన్నికల సమయంలో తాము చేసిన హెచ్చరికలే ఇప్పుడు నిజమవుతున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లిలోనూ రైతులు విద్యుత్ సమస్యపై రోడ్డెక్కారని గుర్తు చేశారు.

### ఆరు బృందాలతో క్షేత్రస్థాయి పరిశీలన

విద్యుత్ వ్యవస్థపై తాము చేస్తున్న ఆరోపణలకు క్షేత్రస్థాయి ఆధారాలు సేకరించేందుకు ఆరు బృందాలను పంపుతున్నట్టు కేటీఆర్ ప్రకటించారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి నేతృత్వంలోని బృందం పరిశీలిస్తుంది. కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్‌ను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు ఆధ్వర్యంలోని బృందం సందర్శిస్తుంది. మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను మాజీ మంత్రి పువ్వాడ అజయ్, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు నేతృత్వంలోని బృందం పరిశీలించనుంది. భూపాలపల్లిలోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టును ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తదితరులు పరిశీలిస్తారు. జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, అనిల్ జాదవ్, మాజీ మంత్రి జోగు రామన్న, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దివాకర్‌రావు తదితరులు సందర్శించనున్నారు. హైదరాబాద్‌లోని సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే వివేకానందగౌడ్, ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, శంభీపూర్ రాజు తదితరులు పరిశీలిస్తారు. అన్ని అంశాలను పరిశీలించి వాస్తవాలను ప్రజల ముందుంచుతామని కేటీఆర్ తెలిపారు. రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలని, పంటలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసిన ఆయన ఆరు బృందాల నివేదికల అనంతరం పార్టీ తరఫున తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు.

# డిజిటల్ గవర్నెన్స్‌లో రోల్ మోడల్‌గా తెలంగాణ

హైదరాబాద్,సిరి న్యూస్, సెప్టెంబర్ 23 :

గుడ్ గవర్నెన్స్‌కు టెక్నాలజీని జోడించి డిజిటల్ గవర్నెన్స్‌లో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. పౌర సేవల్ని నేరుగా ఇంటి ముంగిటకే చేర్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. బాగ్ లింగంపల్లిలోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో 'మీ సేవ డోర్ డెలివరీ సర్వీసెస్'ను ఆయన బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పాలనలోనూ అనేక విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుడుతున్నామన్నారు. అడ్మినిస్ట్రేషన్‌కు టెక్నాలజీని జోడించి పారదర్శకత, జవాబుదారీతనం, సుపరిపాలనకు పెద్ద పీట వేస్తున్నామన్నారు. ప్రభుత్వం, యంత్రాంగమే నేరుగా ప్రజల దగ్గరికే వెళ్లేలా ఈ 'డోర్ డెలివరీ సర్వీసెస్'కు శ్రీకారం చుట్టామన్నారు. 1100 టోల్ ఫ్రీ నంబర్ లేదా మీ సేవ పోర్టల్ ద్వారా స్లాట్ బుక్ చేసుకుంటే జనన/మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆదాయ, కుల, నివాస సర్టిఫికెట్లు, ఈసీ కాపీలు, పోలీసు శాఖ సేవలు, ఐజీఆర్‌ఎస్ రిజిస్ట్రేషన్లు తదితర మీ సేవ సేవలను ఇంటి దగ్గరే అందిస్తామన్నారు. ఇందుకోసం 70మందికి పైగా మీ సేవ ఏజెంట్లు, మీ సేవ వీఎల్ఈలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. తొలి దశలో 'క్యూర' ప్రాంతాల్లో ఈ సేవలను ప్రారంభిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకూ విస్తరిస్తామన్నారు. పౌరులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుని ఇంటి నుంచే పౌర సేవల్ని పొందాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఐటీఈఅండ్ సీ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, మీ సేవ కమిషనర్ రవి కిరణ్, టీజీటీఎస్ ఎండీ సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# శ్రీరామ నవమికి ముందే పనులు పూర్తి కావాలి

- **నాణ్యత, శాస్త్ర విషయాల్లో రాజీ వద్దు**
- **భద్రాద్రి ఆలయ అభివృద్ధి పనులు పరిశీలించిన మంత్రి పొంగులేటి**

భద్రాచలం,సిరి న్యూస్, సెప్టెంబర్ 23 :

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ పునరుద్ధరణ, అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసేలా వేగం పెంచాలని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శ్రీరామనవమి, గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు కార్యాచరణతో పనులు నిర్వహించాలని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బుధవారం భద్రాచలం వచ్చిన ఆయన ముందుగా శ్రీ సీతారామచంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, భద్రాచలం, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజులతో కలిసి మంత్రి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఉత్తర ద్వారం వద్ద ఉన్న దమ్మక్క విగ్రహం ప్రాంతం నుంచి పరిశీలన ప్రారంభించి వివిధ నిర్మాణ పనుల పురోగతి, ప్రస్తుత దశ, పూర్తికి అవసరమైన సమయం, మానవ వనరులు, నిర్మాణ సామగ్రి తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. లిఫ్టులు, స్లాబ్‌లు, రాతి పనులు, రహదారుల అభివృద్ధి, నిర్మాణ సామగ్రి లభ్యత, సిబ్బంది సమీకరణ, అదనపు నిధులు, సాంకేతిక సమన్వయం తదితర అంశాలపై పనుల వారీగా పురోగతిని పరిశీలించారు. ప్రతి విభాగానికి స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించి వారంవారీ ప్రణాళిక ప్రకారం పనులను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఆలయ పునరుద్ధరణ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం సుమారు రూ.275 కోట్లT మంజూరు చేసిందన్నారు. ఇప్పటికే పనులు వేగం పుంజుకున్నాయని చెప్పారు. శ్రీరామనవమికి ముందుగానే ప్రధాన పనులు పూర్తయ్యేలా రివర్స్ ప్లానింగ్ రూపొందించుకోవాలని, గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ఆలయం, మాడ వీధులు, అంతర్గత ప్రాకారం, బాహ్య ప్రాకారం తదితర ప్రాంతాల్లో చేపడుతున్న పనులను ముందుగానే పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ప్రతి మూడు రోజులకు ఒక లిఫ్ట్ పనిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. నిర్మాణ సామగ్రి అందుబాటులో లేక పనులకు అంతరాయం కలగకుండా ముందుగానే సిద్ధంగా ఉంచాలని, అవసరమైనచోట బూమ్ పంపులు, ఇతర యంత్ర పరికరాలను వినియోగించి పనుల సామర్థ్యాన్ని పెంచాలని తెలిపారు. స్లాబ్ పనుల్లో ఒక దశ పూర్తయ్యేసరికి తదుపరి దశకు సంబంధించిన ఏర్పాట్లు ఆలస్యం కాకుండా సమాంతరంగా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు.

పనుల మధ్య ఖాళీ సమయం తగ్గించి నిరంతరాయంగా నిర్మాణ కార్యకలాపాలు కొనసాగేలా సమన్వయం చేసుకోవాలని చెప్పారు. రాతి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన నిపుణులు, సిబ్బందిని ప్రత్యేకంగా కేటాయించి రోజువారీ లక్ష్యాలతో పనులు నిర్వహించాలని తెలిపారు. గతంలో చేపట్టిన భారీ ఆలయ, జాతర ప్రాంతాల నిర్మాణ పనుల అనుభవాలను పరిగణనలోకి తీసుకుని ముందస్తు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఆలయ నిర్మాణంలో నాణ్యతతోపాటు శాస్త్రోక్తతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. ఆలయ సంప్రదాయాలు, నిర్మాణ విధానాలకు అనుగుణంగా పనులు సాగుతున్నాయా అనే అంశాన్ని సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని చెప్పారు. నిర్మాణ నాణ్యతలో ఎలాంటి లోపాలకు తావులేకుండా పర్యవేక్షణ వ్యవస్థను పటిష్టం చేయాలని ఆదేశించారు. ఆలయ పరిసర రహదారుల అభివృద్ధికి సంబంధించి సుమారు రూ.25 కోట్ల ప్రతిపాదనను త్వరితగతిన మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఆలయ పనుల పురోగతిపై ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, దేవస్థానం ఈవో దామోదర్ రావు, ఇంజనీరింగ్ అధికారులు, ఆర్కిటెక్టులు, సంబంధిత శాఖల అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



# రాజకీయాల పరమార్థం నిస్వార్థ ప్రజాసేవ

- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు**
- **నాగోల్‌లో బీజేవైఎం ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం**

హైదరాబాద్, సిరి న్యూస్ , సెప్టెంబర్ 23 :

రాజకీయాలు అంటే ఎన్నికలు, ఓట్లు మాత్రమే కాదని, సమాజ హితం కోసం నిస్వార్థ సేవ చేయడమే ప్రజాప్రతినిధికి నిజమైన సంతృప్తినిస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాప్రతినిధిగా (ముఖ్యమంత్రిగా, ప్రధాన మంత్రిగా) 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా భారతీయ జనతా యువమోర్చా(బీజేవైఎం) ఆధ్వర్యంలో నాగోల్‌లో బుధవారం భారీ మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రామచందర్ రావు ముఖ్య అతిథిగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి స్వయంగా రక్తదానం చేసి యువతలో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నాయకుడి ఆలోచనా విధానంలో ప్రజాసేవ అంతర్భాగం కావాలని, సమాజానికి మేలు చేసినప్పుడే అంతర్గతంగా నిజమైన సంతృప్తి, సంతోషం లభిస్తాయని అన్నారు. నరేంద్ర మోదీ జన్మదినం, అలాగే ఆయన 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని ప్రజల్లో సేవా భావాన్ని మరింత పెంపొందించాలనే సంకల్పంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రధాని మోదీ విద్యారంగానికి పెద్దపీట వేస్తూ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని, దేశవ్యాప్తంగా ఐఐటీలు, ఎయిమ్స్, ఐఐఎంలతోపాటు ఉన్నత విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలను భారీగా పెంచారని కొనియాడారు. మోదీ దేశసేవను ఆదర్శంగా తీసుకుని సేవా రంగంలో యువత ముందుండాలని పిలుపునిచ్చారు. ఇతరుల ప్రాణాలు కాపాడేందుకు చేసే రక్తదానం జీవితంలో వెలకట్టలేని సంతృప్తిని ఇస్తుందని అన్నారు. ఈ స్ఫూర్తిని ఇలాగే కొనసాగిస్తూ రాష్ట్రంలోని మరింతమంది యువత ముందుకొచ్చి రక్తదానం చేయాలని రామచందర్ రావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఎన్. గౌతం రావు, వీరేందర్ గౌడ్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు, బండ కార్తీక



రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుందే, రాష్ట్ర కార్యదర్శి భరత్ ప్రసాద్, బీజేవైఎం రాష్ట్ర, జిల్లాస్థాయి నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో విద్యార్థులు, యువత పాల్గొన్నారు.

**ఎన్నికలకు సమాయత్తం కావాలి**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు అధ్యక్షతన రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఎన్నికలు, ఐదు మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికలకు సంబంధించి సన్నాహక సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో ఆయా కార్పొరేషన్లకు సంబంధించిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రానున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడం, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, ఎన్నికల నిర్వహణకు అనుసరించాల్సిన వ్యూహాలు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ నియోజకవర్గాలు, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసేలా కార్యాచరణ రూపొందించాలని రామచందర్ రావు నాయకులకు దిశానిర్దేశం చేశారు.

# డ్రగ్స్‌పై పోరాటం ఇంటి నుంచే ప్రారంభం

- **ప్రభుత్వం, పోలీసులకే బాధ్యత పరిమితం కాదు: గవర్నర్ శివప్రతాప్ శుక్లా**
- **కుటుంబాలు, విద్యాసంస్థలు, సమాజం కలిసి ఉద్యమంగా మార్చాలి**
- **విద్యార్థులతో యాంటీ డ్రగ్ ప్రతిజ్ఞ, డిక్లరేషన్‌కు సూచన**
- **వ్యసన బాధితులకు కౌన్సెలింగ్, పునరావాసం కల్పించాలి**
- **'నశా ముక్త్ యువ' కార్యక్రమాన్ని మిషన్ మోడ్‌లో అమలు చేయాలి**

హైదరాబాద్, సిరి న్యూస్, సెప్టెంబరు 23:

డ్రగ్స్ మహమ్మారి నుంచి యువతను, విద్యార్థులను కాపాడటం ప్రభుత్వం, పోలీసుల బాధ్యత మాత్రమే కాదని.. ప్రతి కుటుంబం, విద్యాసంస్థ, సమాజం కలిసి చేపట్టాల్సిన సామాజిక ఉద్యమమని తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. డ్రగ్స్‌పై పోరాటం ఇంటి నుంచే ప్రారంభమై.. విద్యాసంస్థల్లో బలపడి, యువత ద్వారా ప్రజా ఉద్యమంగా మారాలని పిలుపునిచ్చారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా.. గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి 'నశా ముక్త్ భారత్ అభియాన్'ను తెలంగాణలో ప్రజా ఉద్యమంగా మార్చేందుకు శివప్రతాప్ శుక్లా పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. హైదరాబాద్‌తో పాటు నిజామాబాద్, హనుమకొండ, వరంగల్, ఆసిఫాబాద్ జిల్లాల్లో పర్యటించి యువత, విద్యార్థుల్లో అవగాహన కల్పించారు.




ప్రతి పాఠశాల, కళాశాలలో యాంటీ డ్రగ్ ప్రతిజ్ఞ చేయించడంతో పాటు.. విద్యాసంస్థల్లో చేరే సమయంలోనే డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని విద్యార్థులతో డిక్లరేషన్ తీసుకోవాలని సూచించారు.

మిషన్ మోడ్‌లో కార్యక్రమాలు విశ్వవిద్యాలయాల వీసీలతో నిర్వహించిన సమావేశంలో 'నశా ముక్త్ యువ' కార్యక్రమాన్ని మిషన్ మోడ్‌లో అమలు చేయాలని గవర్నర్ సూచించారు. విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లు, అధ్యాపకులు 'మై భారత్' పోర్టల్ ద్వారా ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. వ్యసనానికి గురైన వారిని కేవలం నేరస్తులుగా చూడకుండా కౌన్సెలింగ్, పునరావాసం కల్పించాలని సూచించారు. యువత తమ శక్తిసామర్థ్యాలను విద్య, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణల వైపు మళ్లించాలని కోరారు.

# మాతృభూమి ప్రగతి కోసం



- **అమెరికా పర్యటనలో నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి**
- **నెమలి మాధవరెడ్డి నాయకత్వంలో రఘువీర్ రెడ్డి నీ సన్మానించిన యెన్ఆర్ఐ లు**
- **మీట్ అండ్ గ్రేట్ ప్రోగ్రామ్ లో ఎంపీ రఘువీర్ రెడ్డి**

**నిడమనూరు, సెప్టెంబర్23, సిరి న్యూస్:**

కాలిఫోర్నియాలో నల్గొండ లోక్‌సభ సభ్యులు కుందూరు రఘువీర్ గౌరవార్ధం మీట్ అండ్ గ్రేట్ కార్యక్రమం నిర్వహించారు. ఐఓసి జాయినింగ్ కమిటీ చైర్మన్ నెమలి మాధవ రెడ్డి ఆద్వర్యం లో జరిగిన ఈ సమావేశాన్ని సందీప్ వంగాల ఐఓసి యూఎస్ఏ నేషనల్ జనరల్ సెక్రటరీ, రామసహాయం శ్రీనివాసరెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ ప్రవాస భారతీయులతో కలిసి జాతీయ రాజకీయాలు, ఢిల్లీ పరిణామాలు & పార్లమెంట్ వ్యూహాలు. వచ్చే ఎలెక్షన్ల లో రాహుల్ గాంధీ గారిని ప్రధానమంత్రిని చేసే విషయం, తెలంగాణలో పార్టీ శ్రేణుల బలోపేతం. నల్గొండ అభివృద్ధి మరియు రాష్ట్ర పారిశ్రామిక, సాంకేతిక ప్రగతి, మౌలిక వసతుల కల్పన & తెలంగాణ అభివృద్ధిలో ఎన్ఆర్ఐల పెట్టుబడుల ప్రాధాన్యత, 22ఏ పైన అవగాహన, ఎన్ఆర్ఐల పెట్టుబడులకు భరోసా, ప్రజాప్రభుత్వం లో అమలవుతున్న ప్రభుత్వ పథకాల పైన సుదీర్ఘంగా చర్చించారు. సమావేశానికి తరలివచ్చిన వివిధ ఎన్ఆర్ఐ సంఘాల ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియ జేసారు.

# స్టడీ టూర్ లో మార్కెట్ పాలక మండలి




**నిడమనూరు,సెప్టెంబర్23, సిరి న్యూస్:**

నల్లగొండ జిల్లా నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ , చైర్మన్ వైస్ చైర్మన్ పాలకవర్గ సభ్యులు స్టడీ టూర్ లో భాగంగా బుధవారం (24) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏలూరు మార్కెట్ యార్డ్ ను సందర్శించారు. అక్కడ రైతుల కోసం మార్కెట్ కమిటీ చేపడుతున్న పద్ధతులను అధ్యయనం చేశారు. కార్యక్రమంలో చైర్మన్ అంకతి సత్యనారాయణ, వైస్ చైర్మన్ బూసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పాలక వర్గ సభ్యులు మన్యం శంకర్, పాల్వాయి చంద్రశేఖర్ రెడ్డి, మేండె వెంకటేశ్వర్లు, సపావత్ శ్రీను, పోల గాని పరుశురాం, బెలిదే అశోక్, జయరాం నాయక్, కార్యదర్శి చందర్ రావు సిబ్బంది రాజు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఏకదంతా వినాయక లడ్డు
## వేలం పాటలో దక్కించుకున్న అంజిరెడ్డి



**సదాశివపేట. సెప్టెంబర్ 23. (సిరిన్యూస్)**

సదాశివపేట మండలం మెలిగిపెట్ గ్రామంలోని వినాయక నిమజ్జనం అత్యంత ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ వినాయకుని రథయాత్రలో గ్రామంలోని పెద్దలు యువకులు పాల్గొని గ్రామంలోని ఏకదంతా వినాయకుని లడ్డు వేలంపాట ఆసక్తికరంగా జరిగింది. 25 కిలోల లడ్డును గ్రామానికి చెందిన సింగూర్ అంజి రెడ్డి ఒక్క లక్ష ఒక్క వెయ్యి అందుకున్నారు. రెండవ లడ్డు పెద్ద గొల్ల మల్లేశం 66వేల రూపాయలకు, మూడవ లడ్డు తెలుగు తుల్జారం 45 వేలకు అందుకున్నారు.

# దౌల్తాబాద్‌లో వినాయక లడ్డూలకు భారీగా వేలంపాటలు పలికాయి..

**హత్నూర, సెప్టెంబర్ 23 (సిరి న్యూస్):**

దౌల్తాబాద్‌లో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన లడ్డూ వేలం పాటలు భక్తుల సందడి మధ్య ఉత్సాహంగా సాగాయి. పలు వినాయక మండపాల వద్ద నిర్వహించిన వేలం పాటల్లో భక్తులు పోటాపోటీగా పాల్గొన్నారు. దౌల్తాబాద్‌లోని కొన్యాల కృష్ణ వినాయక చౌక్ లడ్డూను రూ.1.82 లక్షలకు కొన్యాల కృష్ణ దక్కించుకున్నారు. అదేవిధంగా హిందూ వాహిని యూత్ ఆధ్వర్యంలోని వినాయక లడ్డూను రాజు గౌడ్ స్వామి రూ.8 లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. ఈ వేలం పాటలో భారీ మొత్తానికి లడ్డూ దక్కడం స్థానికంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శ్రీ సాయి యూత్ ఆధ్వర్యంలోని వినాయక లడ్డూను రామగిరి రాజేశ్వర్ కుమారుడు రూ.61 వేలకు దక్కించుకున్నారు. లడ్డూ వేలం పాటలను వీక్షించేందుకు స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వేలం అనంతరం నిర్వాహకులు విజేతలను అభినందించారు. వినాయక ఉత్సవాల సందర్భంగా భక్తుల మధ్య సోదరభావం, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# ఘనంగా ప్రైవేట్ పాఠశాలల గురుపూజోత్సవ వేడుకలు







- **200 మంది ఉత్తమ ప్రైవేట్ ఉపాధ్యాయులకు ఘన సత్కారం**
- **25 సంవత్సరాలుగా గురు పూజోత్సవ వేడుకలు నిర్వహించడం అభినందనీయం**
- **నవ సమాజ నిర్దేశకులు గురువులు**
- **పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్ చెరు, సెప్టెంబర్ 23, (సిరి. న్యూస్)**

ఒక దేశ భవిష్యత్తు నిర్మాణం తరగతి గదిలోనే జరుగుతుందని, ప్రతి విద్యార్థిని భావి భారత పౌరుడుగా తీర్చిదిద్దాల్సిన గురుతర బాధ్యత ప్రతి ఉపాధ్యాయుడి పై ఉందని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గత 25 సంవత్సరాలుగా గురుపూజోత్సవం పురస్కరించుకొని నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులను ప్రతి ఏటా సన్మానించుకోవడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. బుధవారం స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పటాన్ చెరు డివిజన్ పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో పటాన్ చెరు నియోజకవర్గ స్థాయి ప్రైవేటు పాఠశాలల గురుపూజోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని ప్రైవేటు పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 200 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ.. పటాన్ చెరు నియోజకవర్గంలో అధిక శాతం పేద, మధ్యతరగతి కుటుంబాలు తమ పిల్లలని ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలలకు పంపుతున్నారని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలల ద్వారా పోటీ ఏర్పడుతున్నప్పటికీ ప్రైవేటు పాఠశాలలు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాయని అభినందించారు. ప్రస్తుత సమాజంలో మొబైల్ వాడకం అత్యంత ప్రమాదకరంగా మారిందని తెలిపారు. టెక్నాలజీని మనిషి ఎదుగుదలకు ఉపయోగించుకుంటే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని.. అదే టెక్నాలజీని దుర్వినియోగం చేస్తే సమాజానికి ముప్పు వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఉపాధ్యాయుడు తన తరగతి గదిలోని ప్రతి విద్యార్థి చదువుతోపాటు మానసిక ప్రవర్తన పై ఎప్పటికప్పుడు గమనించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు నిర్వహించిన సంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

# వీ హబ్ ను సందర్శించిన గీతం విద్యార్థినులు

- **గీతం మహిళా సాధికారిత సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు**
- **వ్యవస్థాపకత, స్టార్టప్ లపై అవగాహన**

**పటాన్ చెరు, సెప్టెంబర్ 22, (సిరి న్యూస్):**






హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విద్యార్థినులు బుధవారం వీ హబ్ (WE HUB) ను సందర్శించారు. గీతం మహిళా సాధికారత సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పారిశ్రామిక సందర్శన ద్వారా విద్యార్థులకు వ్యవస్థాపకత, స్టార్టప్ పర్యావరణ వ్యవస్థపై విలువైన అవగాహన కల్పించారు. మహిళా సాధికారత సెల్ చైర్ పర్సన్ ప్రొఫెసర్ ప్రీతి పర్వేకర్ పర్యవేక్షణలో, సుమారు 40 మంది విద్యార్థినులు, ఐదుగురు మహిళా అధ్యాపకులు ఈ సందర్శనలో పాల్గొన్నారు. మహిళా పారిశ్రామికవేత్తల కోసం భారతదేశపు మొట్టమొదటి రాష్ట్రఆధారిత నోడల్ ఈ సందర్శన ద్వారా విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న విషయాలను వాస్తవ ప్రపంచ పారిశ్రామిక పద్ధతులతో అనుసంధానించుకోవడంతో పాటు, మహిళా నేతృత్వంలోని వ్యవస్థాపకత, నాయకత్వం, సృజనాత్మకత, సమస్యపరిష్కారంపై అవగాహన పొందారు. ఇది వారి వృత్తి పరమైన, వ్యక్తిగత అభివృద్ధికి దోహదపడే ఒక అర్థవంతమైన అనుభవపూర్వక అభ్యాస అవకాశంగా ఉపయోగపడింది. ఈ సందర్శనలో సీఎస్ఎస్ఈ విభాగం నుంచి జ్యోతి బంకాపల్లి, డాక్టర్ అపర్ణ, ఆర్కిటెక్చర్ విభాగం నుంచి డాక్టర్ సౌపూర్ణి పాల్, మనస్తత్వశాస్త్ర విభాగం నుంచి డాక్టర్ దుర్గేష్ నందిని తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

# రేణుక ఎల్లమ్మ ఆలయం చోరీ







**హవేలీ ఘనపూర్( సిరి న్యూస్)**

హవేలీ ఘనపూర్ మండలం బూరుగుపల్లి గ్రామం లోని గ్రామ శివారులో గల రేణుక ఎల్లమ్మ టెంపుల్ లో చోరీ నిత్యం పూజలు చేస్తున్న పూజారి అశోక్ రోజువారిగా గుడికి ఉదయాన రాగానే ఉండి తాళం పగలగొట్టి ఉండి మరియు ప్రధాన ద్వారం తాళాలు పగలగొట్టి ఉండి లోపల బీరువా తలలు పగలగొట్టి ఉండడంతో గ్రామస్తులకు తెలియజేయడంతో గ్రామస్తులు అందరూ కలిసి సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్ఐకి సమాచారం ఇవ్వడంతో ఎస్సై గారు వచ్చి చుట్టుపక్కల పరిశీలించగా దుండగులు

ముందుగానే సీసీ కెమెరాలు పగలగొట్టి ఉండిని పగలగొట్టి ప్రధాన ద్వారం తాళం పగలగొట్టి హుండీ మరియు బీరువాలోని వస్తువులు దొంగిలించారు గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు ఎస్సై గారు ఎల్లమ్మ టెంపుల్ సందర్శించి అక్కడ జరిగినటువంటి సంఘటన చూసి నిందితులను ఫింగర్ ప్రింట్ ఆధారంగా త్వరలో పట్టుకుంటామని ఎస్ఐ సత్యనారాయణ గారు తెలిపారు

# సదాశివపేట మండల కాంగ్రెస్ సేవాదళ్ కమిటీ సమావేశం





**సదాశివపేట. సెప్టెంబర్ 23. (సిరీన్యూస్)**

సదాశివాపేట మండలంలో కాంగ్రెస్ సేవాదళ్ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కరణం సందీప్, సీడీసీ చైర్మెన్ గడీల రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అద్యేక్షలు చాట్ల సిద్దన్న, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఒగ్గు శ్రీనివాస్, ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా సేవాదళ్ నియమ నిబంధనలు, రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, సేవాదళ్ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యల గురించి మండల కార్యవర్గంతో కలిసి కరణం సందీప్ నాయకులకు, కార్యకర్తలకు సమగ్రంగా వివరించారు. సేవాదళ్ అంటే ఏమిటో ప్రజలలోకి తీసుకుపోయి సేవాదల్ ప్రాముఖ్యత ను అలాగే పార్టీ నిర్వహించే అన్ని కార్యక్రమాలతో పాటు నిర్మ్మాలజగ్గరెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆదేశాల మేరకు అన్ని కార్యక్రమాల్లో మనం పూర్తిస్థాయిలో పాల్గొని ప్రజలకు అవసరమైన పథకాలను గురుంచి పార్టీ తరపున వివరించాలని జిల్లా అధ్యక్షులు శ్రీ సందీప్ వివరించడం జరిగింది. అఖిల భారతీయ సేవాదళ్ అధ్యక్షులు బి శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్ నాయకత్వంలో సేవాదళ్ ముందుకు వెళుతోందని, జిల్లా అధ్యక్షులు కరణం సందీప్ తో కలిసి చేపట్టిన ఈ చర్చల ద్వారా మన మండల, జిల్లా సేవాదళ్ మరింత బలోపేతమైందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి నరసింహులు కాంగ్రెస్ సేవాదళ్ మండల అధ్యక్షుడు, మండల సేవాదళ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోలుకుందె వెంకట్ రేడ్డి,ఉప అధ్యక్షులు కే. భవాని ప్రసాద్, కిందొడ్ల శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శిలు హరిజన ఆశమ్మా, నాగరాజ్ గౌడ్, సిహెచ్ విష్ణు,కార్యదర్శిలు భాను ప్రసాద్, సయ్యద్ మునీర్,గుడ్డల మహేందర్,తలారి ప్రశాంత్, లక్ష్మణ్, మెట్టు పద్మమ్మ,ఎక్సక్యూటివ్ మెంబెర్ ఆనంద్ కుమర్, ఫాజిల్, క్రాంతి కుమర్, మంగలి తులజారామ్ గొల్ల నర్సిములు, సదశివాపేట మండల కాంగ్రెస్ సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

# విజయ డెయిరీ నూతనకార్యవర్గం ఎన్నిక

- **అధ్యక్షుడిగా బాన్సువాడ గోపాల్‌రెడ్డి.**

**మెదక్ సెప్టెంబర్,23(సిరి న్యూస్)**

పాల ఉత్పత్తిదారుల సహకార సమైక్య విజయ డెయిరీ ఎంసీసీ మెదక్‌లో నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యుల సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను పాల ఉత్పత్తిదారులు, విజయ డెయిరీ ప్రతినిధులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.విజయ డెయిరీ నూతన అధ్యక్షుడిగా బాన్సువాడ గోపాల్‌రెడ్డి,




ఉపాధ్యక్షుడిగా మైలారం రవి, కోశాధికారిగా శేఖర్‌రెడ్డి, కార్యదర్శిగా సాయిరెడ్డి, సలహాదారులుగా గోపాల్, వెంకట్‌గౌడ్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారిని శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. నూతన కార్యవర్గం పాల ఉత్పత్తిదారుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని పలువురు ఆకాంక్షించారు. పాల ఉత్పత్తిదారులకు విజయ డెయిరీ ద్వారా మరింత మెరుగైన సేవలు అందించడంతో పాటు, వారి ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నూతన కార్యవర్గం సమష్టిగా పనిచేసి విజయ డెయిరీ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో విజయ డెయిరీ ప్రతినిధులు, పాల ఉత్పత్తిదారులు, సహకార సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# న్యాయం చేయకుంటే చావే శరణ్యం

- **ఇంటి నిర్మాణానికి అడ్డంకులు.**
- **పాత కక్షలతో వివాదం సృష్టిస్తున్నారు.**
- **ప్రహరీ గోడ కూల్చి దాడికి యత్నం.**
- **ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితులు.**

**మెదక్ సెప్టెంబర్,23(సిరి న్యూస్)**

సొంత స్థలంలో ఇల్లు నిర్మాణం చేపడితే గ్రామం లో కొందరు అడ్డుకుని ప్రహరీ గోడను కూల్చివేసి, దూషిస్తూ తమపై దాడికి యత్నించారని హవేలిఘనపూర్ మండలం వాడి గ్రామానికి చెందిన గుమ్మాల పుష్పమాల ఆరోపించారు. బుధవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో మాజీ సర్పంచ్ తార్యా నాయక్ తో కలిసి ఫిర్యాదు చేశారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని తన సొంత స్థలంలో ప్రహరీ గోడ నిర్మాణానికి పునాది తీస్తుండగా కొందరు పనులను అడ్డుకున్నారని తెలిపారు. తమను అసభ్య పదజాలంతో దూషిస్తూ దాడికి యత్నించారని, నిర్మించిన



గోడను కూల్చివేశారని తెలిపారు.గతంలో గ్రామంలోని వెలుగు కార్యాలయ నిర్మాణానికి తమ స్థలంలో 25 అడుగుల పొడవు, 9 అడుగుల వెడల్పు స్థలాన్ని ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా దానంగా ఇచ్చామని పేర్కొన్నారు. ప్రస్తుతం తమ స్థలంలో ఇల్లు నిర్మించుకుంటుంటే కొందరు కావాలనే అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారని ఆరోపించారు. ఇతరులు ఇళ్లు నిర్మించుకున్నా అభ్యంతరం చెప్పకుండా తమ విషయంలోనే అడ్డంకులు సృష్టిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పాత కక్షల నేపథ్యంలోనే వివాదం సృష్టిస్తున్నారని, తమకు ప్రాణహాని ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సొంత స్థలంలో నిర్మాణ పనులకు పోలీసు బందోబస్తు కల్పించాలని, తమను అడ్డుకుంటున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్, డీఎస్పీ, ఆర్డీవో, తహశీల్దార్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.న్యాయం చేయని పక్షంలో మాకు చావే శరణ్యం అని అధికారులను వేడుకున్నారు.

# హామీలు అమలు చేయకుండా కమిటీల పేరుతో కాలయాపన

- **పీఆర్సీ నివేదిక గడువు ముగిసినా స్పష్టత లేదు**
- **బకాయిలపై స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలి**
- **లేకుంటే ఉద్యమాలకు సిద్ధం**
- **ఉద్యోగుల ఆందోళనలకు బీఆర్ఎస్ పూర్తి మద్దతు ఉంటుంది**
- **మాజీ బేవరేజ్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్**

**హైదరాబాద్, సెప్టెంబర్ 23 (సిరి న్యూస్):**

ఉద్యోగులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ బేవరేజ్ కార్పొరేషన్ చైర్మన్ దేవీప్రసాద్ తీవ్రంగా విమర్శించారు. హామీల అమలు కోసం ఉద్యోగులు అనేకసార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసినప్పటికీ.. చర్చలు, సమావేశాలు, కమిటీల పేరుతో కాలయాపన చేయడం తప్ప సమస్యలకు ఎలాంటి పరిష్కారమూ చూపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఆర్సీ గడువు మూడేళ్లు పూర్తయినా ఇప్పటివరకు నివేదికను తెప్పించుకోలేకపోవడం ఉద్యోగుల పట్ల ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. నివేదిక ఎప్పుడు వస్తుంది, ఎప్పుడు అమలు చేస్తారనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం లేదని, పీఆర్సీపై కేవలం చర్చలు కాకుండా నివేదిక, నిర్ణయం, అమలు కావాలని డిమాండ్ చేశారు.

**ప్రభుత్వ నాన్చివేత ధోరణిపై విమర్శలు..**

సీపీఎస్ రద్దు: సీపీఎస్ రద్దు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయకుండా మళ్లీ అధ్యయన కమిటీ ఏర్పాటు చేయడం కేవలం కాలయాపనకే దారితీస్తుందని, ఉద్యోగుల భవిష్యత్తుతో ముడిపడిన అంశాన్ని కమిటీలకు అప్పగించి ప్రభుత్వం తన బాధ్యత నుంచి తప్పించుకోవాలని చూస్తోందని ఆరోపించారు. ఆరు డీఏలు




పెండింగ్‌లో ఉండగా కేవలం రెండు డీఏలు మాత్రమే విడుతల వారీగా ఇస్తామని చెప్పడం ఉద్యోగుల మనోభావాలను అవమానించడమేనని, మిగిలిన డీఏలపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఉద్యోగ సంఘాలలో చీలిక తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, సానుకూల నిర్ణయం రాకముందే కొందరు స్వాగత ప్రకటనలు ఇవ్వడం ఉద్యోగులను పక్కదారి పట్టించేలా ఉందని పేర్కొన్నారు.

పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రావాల్సిన గ్రాట్యుటీ, లీవ్ సాలరీ, కమ్యుటేషన్, జీపీఎఫ్, గ్రూప్ ఇన్సూరెన్స్ తదితర బకాయిలపై కూడా ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన కార్యాచరణ ప్రకటించలేదన్నారు. ఉద్యోగులు అడుగుతున్నది కొత్త వరాలు కాదని, కేవలం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలేనని దేవీప్రసాద్ స్పష్టం చేశారు. చర్చల పేరుతో మరో ఆరు నెలలు గడిపే ప్రయత్నం చేస్తే ఉద్యోగులు మరింత బలమైన ప్రజాస్వామ్య ఉద్యమానికి సిద్ధం కావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇకపై హామీలు, చర్చలు కాకుండా తేదీలతో కూడిన కార్యాచరణ ప్రకటించి ప్రతి హామీని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగుల మనోవేదనను ప్రతిబింబించేలా 'ఉద్యోగుల జేఏసీ' కార్యాచరణకు సిద్ధం కావాలని కోరిన ఆయన.. ఉద్యోగుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు వారి ఆందోళనలకు బీఆర్ఎస్ పార్టీ తరఫున పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు వెల్లడించారు.

# మండలంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

- **జీడీసీ, పీహెచ్‌సీ, తహసీల్దార్ కార్యాలయం, ఎస్సీ హాస్టల్ పరిశీలన**

**మునిపల్లి, సెప్టెంబర్ 23 (సిరి న్యూస్):**

మునిపల్లి మండలంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బుదేరా మహిళా డిగ్రీ కళాశాల, మునిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తహసీల్దార్ కార్యాలయం, ఎస్సీ హాస్టల్‌ను పరిశీలించి ఆయా శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. బుదేరా మహిళా డిగ్రీ కళాశాలలో లైబ్రరీ, వంటశాల, వసతి గృహాన్ని పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. కళాశాలలో అవసరమైన వసతులపై దృష్టిసారించాలని, విద్యార్థుల



చదువులకు నిధులు సద్వినియోగం చేయాలని పేర్కొన్నారు. నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం, విద్యాబోధనపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మునిపల్లి పీహెచ్‌సీని సందర్శించి రోగులతో మాట్లాడారు. ఆసుపత్రి భవనానికి పెయింటింగ్ వేయించాలని వైద్యాధికారి సంధ్యారాణిని ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో భూ భారతి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా చర్యలు తీసుకోవాలని, ఎస్ఐఆర్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. నూతన తహసీల్దార్ కార్యాలయ భవన నిర్మాణానికి సంబంధించి స్థలాన్ని పరిశీలించారు. అనంతరం మునిపల్లి ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేసి మరుగుదొడ్ల వద్ద ఫ్లోరింగ్ పనులు చేపట్టాలని హాస్టల్ వార్డెన్ రామప్పకు సూచించారు. కలెక్టర్ వెంట సోషల్ వెల్ఫేర్ డీఈ రాజు, జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి, అందోల్ నియోజకవర్గ ప్రత్యేకాధికారి జగదీశ్వర్, యూత్ అండ్ స్పోర్ట్స్ అధికారి అఖిలేష్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల ప్రత్యేకాధికారి రామాచారి, తహసీల్దార్ రంగారావు, ఆర్ఐ సాయికిరణ్, పంచాయతీ కార్యదర్శి నర్సింలు తదితరులు ఉన్నారు.

# ఇద్దరు వ్యక్తులకు 30 రోజుల రిమాండ్

- **జూదం, అసాంఘిక కార్యకలాపాలు పాల్పడినందుకు**
- **మరో 8 మందికి రూ .3000 జరిమానా**

**నర్సాపూర్ సెప్టెంబర్ 23 (సిరి న్యూస్)**

జూదం అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన ఇద్దరు వ్యక్తులు బేగరి కుమార్ అహ్మద్‌నగర్ గ్రామం, జక్కుల నర్సింలు, జనకంపేట గ్రామం వీరికి బుధవారం నర్సాపూర్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్ట్ నర్సాపూర్, న్యాయమూర్తి బాల్ రెడ్డి, తెలంగాణ గేమింగ్ యాక్ట్ కింద 30 రోజుల పాటు జ్యుడీషియల్ రిమాండ్ మరో 8 మందికి ఒక్కొక్కరికి రూ.3,000/జరిమాన విధించారు నర్సాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2025 సంవత్సరంలో TS Gaming Act కింద నమోదైన కేసులో నర్సాపూర్ పోలీస్ స్టేషన్, ఎస్సై రంజిత్ కుమార్ దర్యాప్తు చేయగా,బి. సురేష్, స్టేషన్ రైటర్, హరిబాబు గౌడ్ సిబ్బంది,దర్యాప్తులో సహకరించారని ఈ కేసులో చట్టపరమైన ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేసి, నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరిచి తగిన ఆధారాలతో నర్సాపూర్ పోలీసుల కృషి చేశారు జూదం అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నర్సాపూర్ పోలీసులు నిరంతరం నిఘా



ఉంటుంది. ప్రజలు ఎటువంటి జూద కార్యకలాపాల్లో పాల్గొనకుండా, చట్టాన్ని గౌరవిస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని చట్టవిరుద్ధమైన కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వారు వెంటనే నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఏ. రంజిత్ కుమార్ తెలిపారు

# వంటశాల లేక ఆరు బయటనే వంట

**వెల్దుర్తి, సెప్టెంబర్ 23, (సిరి న్యూస్ ):**

వెల్దుర్తి మండలం నూతనంగా ఏర్పడ్డ గ్రామపంచాయతీ ఏలుకపల్లి గ్రామంలో గల ప్రాథమిక పాఠశాల యందు వంటశాల లేక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటామని గ్రామ సర్పంచ్ పావని శివలింగం తెలిపారు. నూతనంగా పంచాయతీ ఏర్పాటు యింది అనే ఆనందం మాటల్లో తప్ప పనుల్లో మాత్రం జాప్యంగానే ఉందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ భవనం కూడా నిర్మాణ దశలోనే ఉందని అంతేకాకుండా చెత్త సేకరణకు ట్రాక్టర్ కూడా లేదని కనీసం పిల్లలకు వంట చేయడానికి పాఠశాల యందు వంటశాల కూడా గ్రామానికి లేదని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి వెంటనే వంటశాల మంజూరు చేయాలని ఆమె కోరారు. అలాగే బుధవారం ప్రభుత్వం నూతనంగా ఏర్పా



టుచేసిన అల్పాహార పథకాన్ని బడి పిల్లలకు అల్పాహారాన్ని పాఠశాల యందు విద్యార్థులకు సర్పంచ్ అందజేశారు.




# నేపాల్ వరద బాధితులకు తెల్లాపూర్ వాసుల అండ..



- **రూ.4.78 లక్షల విరాళం అందజేసిన తేనా**

**రామచంద్రపురం, సెప్టెంబర్ 23 (సిరి న్యూస్):**

నేపాల్‌లో ఇటీవల సంభవించిన భారీ వరదలు, ప్రకృతి విపత్తుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు తెల్లాపూర్ వాసులు అండగా నిలిచారు. తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ (తేనా) ఆధ్వర్యంలో వివిధ నివాస సముదాయాలు, ప్రజల నుంచి సేకరించిన రూ.4,78,973 విలువైన చెక్కులను న్యూఢిల్లీలోని నేపాల్ రాయబార కార్యాలయం డిప్యూటీ కమిషనర్ డా. సురేంద్ర థాపాకు అందజేశారు. ఈ సందర్భంగా డా. సురేంద్ర థాపా నేపాల్ ప్రజల తరఫున తెల్లాపూర్ వాసులకు కృతజ్ఞతలు తెలిపారు.

విపత్కర పరిస్థితుల్లో స్పందించి బాధితులకు అండగా నిలిచిన వారి మానవతా దృక్పథాన్ని అభినందించారు. తేనా అధ్యక్షుడు రమణ ఈశ్వరగారి మాట్లాడుతూ విరాళం అందించేందుకు ముందుకు వచ్చిన నివాస సముదాయాలు, దాతలు, నివాసితులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రకృతి విపత్తుల సమయంలో బాధితులకు అండగా నిలవడం సామాజిక బాధ్యతకు నిదర్శనమన్నారు.

# మహిళ సమైక్య ఆధ్వర్యంలో రొమ్ము క్యాన్సర్ ఉచిత వైద్య శిబిరం



**సదాశివపేట. సెప్టెంబర్ 23. (సిరిన్యూస్)**

సదాశివపేట మండల సమైక్య ఆధ్వర్యంలో బుధవారం ఉచిత రొమ్ము క్యాన్సర్ పరీక్షలు నిర్వహించడం జరిగింది.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి రావడం జరిగింది. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ మహిళలకు రొమ్ము క్యాన్సర్ కు సంబంధించిన పరీక్షలు ఏ ఐ జి హాస్పిటల్ ఆధ్వర్యంలో క్యాంపును నిర్వహించి 150 మంది మహిళలకు రొమ్ము క్యాన్సర్ కు సంబంధించిన పరీక్షలు నిర్వహించారన్నారు. మహిళ ఆరోగ్యంగా ఉన్నట్లయితే ఆ కుటుంబం సుఖ సంతోషాలతో ఉండటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సి డి సి చైర్మన్ గడీల రామ్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చాట్ల సిద్ధన్న, ఏపీఎం శ్రీనివాస్ రావు, డాక్టర్లు ప్రజ్ఞ చిగురాపాటి, ఏఐజి వైద్య బృందం, లాల్ బహదూర్ సింగ్, శేఖర్, నర్సింహులు, ప్రభు కుమార్, మహిపాల్ రెడ్డి, అనిత, వీణ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ మండపాలను సందర్శించిన సింధు ఆదర్శ్ రెడ్డి



**రామచంద్రపురం, సెప్టెంబర్ 23 (సిరి న్యూస్):**

పటాన్‌చెరు నియోజకవర్గం భారతీనగర్ డివిజన్‌లోని పలు గణేష్ మండపాలను మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీడీఎల్ కాలనీ, మ్యాక్ సొసైటీ, ఓల్డ్ ఎంఐజీ కాలనీల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల్లో పూజల్లో పాల్గొన్నారు. అనంతరం బాంబే కాలనీలో వైశ్య సంఘం ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహించిన గణేష్ పూజలో పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాల్లో భక్తులతో కలిసి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక భక్తులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వ్యక్తి అదృశ్యం

**నర్సాపూర్ జులై 23 (సిరి న్యూస్)**

నర్సాపూర్ పట్టణానికి చెందిన వ్యక్తి అదృశ్యం పట్టణానికి చెందిన చ దెగావత్ రవి (42) రోజు కూలీ పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు ఆదివారం ఉదయం పనికి వెళుతున్న అని ఇంట్లో చెప్పి వెళ్ళారని రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చిందని చుట్టుపక్కల స్నేహితుల బంధువుల దగ్గర వెతికిన ఆచూకీ లభించలేదని రవి ఇంట్లో నుండి వెళ్లే సమయంలో ఆకుపచ్చ చొక్కా బ్రౌన్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నారని ఆచూకీ తెలిసినవారికి సమాచారం ఇవ్వాలని భార్య ఫిర్యాదు మేరకు ఏసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నమని ఎస్సై రంజిత్ కుమార్ తెలిపారు



# హైటెన్షన్ వైర్లతో ప్రమాదం





**శివంపేట్ సెప్టెంబర్ 23 ( సిరి న్యూస్ )**

హైటెన్షన్ విద్యుత్ వైర్లు జన వాసాల మధ్య ప్రమాదకరంగా ఉండడం వల్ల గుండ్లపల్లి గ్రామంలో మూడో వార్డులో ఉదయం 10 గంటల సమయంలో ప్రమాదం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన బోడింగ్ కుమార్ మామ ఎల్లయ్య బంగ్లా పైకి ఎక్కే క్రమంలో కరెంట్ షాక్ తో కింద పడడం జరిగింది. విద్యుత్ లైన్ ఇండ్ల మధ్యనే ఉండడంతో స్థానికులు ఈ ఘటనతో భయాందోళనకు గురవుతున్నారు. విద్యుత్ అధికారులకు 11 కెవి హైటెన్షన్ వైర్లను తొలగించాలని పలుమార్లు చెప్పినప్పటికీ తొలగిస్తామని ఏఈ, జూనియర్ ఏఈ, లైన్ మెన్, స్థానిక ఎమ్మెల్యే కు చెప్పినప్పటికీ ప్రయోజనం లేకపోయింది.

ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు తక్షణమే స్పందించి ఇండ్ల మధ్యలో ఉన్నటువంటి 11 కేవీ విద్యుత్ లైన్ ను తొలగించాలని గ్రామ సర్పంచ్ పెంజర్ల మమతా నర్సింలు కోరుచున్నారు. ఈ సంఘటన స్థలంలో గ్రామ ఉపసర్పంచ్ మస్కూరి గ్రామపంచాయతీ పాలకమండలి సభ్యులు సత్యనారాయణ, దత్తాత్రేయ గౌడ్, రమేష్, మాజీ వార్డు సభ్యులు శివరాజ్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల సంఘం రిగ్గింగ్ ను అనుమతిస్తే దేశ ద్రోహమే

- **కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23 :**

ఎన్నికల్లో అక్రమాలు జరుగుతున్నాయని తెలిసి కూడా సీఈసీ జనేష్ కుమార్ వాటిని అనుమతిస్తే అది దేశ ద్రోహం, రాజ ద్రోహమే అవుతుందని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా వ్యాఖ్యానించారు. వయనాడ్ ఎంపీ అయిన ఆమె ఎన్నికల అక్రమాలకు పాల్పడుతున్న వారిని కచ్చితంగా నిలదీయాలన్నారు. ఇక్కడి నిలంబూర్ లో విలేకరులతో బుధవారం మాట్లాడిన ప్రియాంకా గాంధీ భారత ఎన్నికల సంఘం వ్యవహారాల్లో చోటుచేసుకుంటున్న పక్షపాతం, అన్యాయం గురించి తన సోదరుడు, లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నిరంతరం గళమెత్తుతున్నారని తెలిపారు. ఆయన అనేక సమస్యలను పదేపదే ప్రస్తావించారని, ఇప్పుడు స్వయంగా ఎన్నికల కమిషనర్లు కూడా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ కు కొన్ని సమస్యలను వివరించినట్లు వార్తా మాధ్యమాల్లో కూడా వెల్లడవుతోందని చెప్పారు.

# అంగన్వాడి కేంద్రాల్లో పోషణ మహోత్సవాలు

**వెల్దుర్తి , సెప్టెంబర్ 23,(సిరి న్యూస్):**

వెల్దుర్తి మండల పరిధి చేరిల గ్రామం అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడి టీచర్లు దేవలత,లక్ష్మి,ల ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ లావణ్య, అధ్యక్షతన బుధవారం పోషణ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీ బాలింతలకు పౌష్టికాహారం పై అవగాహన కల్పించారు. పోషణ మహోత్సవాల సందర్భంగా వివిధ రకాల న్యూట్రిషన్ చిరుధాన్యాలను ప్రదర్శించారు. పౌష్టికమైన ఆకుకూరలు కాయగూరలు చిరుధాన్యాలను రోజూ తీసుకునే ఆహారంలో క్రమం తప్పకుండా ఉండాలని సూచించారు.ప్రతి గర్భిణీ స్త్రీ



గర్భం దాల్చిన మొదలుకొని ప్రసవించే వరకు పోస్ట్ ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. సర్పంచి లావణ్య మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రంలో అందించే అదనపు ఆహారం పాలు గుడ్లు ఆకు కూరగాయలతో కూడిన ఆహారాన్ని అంగన్వాడి కేంద్రంలోని భుజించాలని సూచించారు ఏఎన్ఎం అనిత మాట్లాడుతూ సబ్ సెంటర్లో అందించే ఆరోగ్య పరీక్షలు నెల నెల ఇంజక్షన్స్ ఐరన్ మాత్రలు క్రమం తప్పకుండా వేసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో గర్భిణీలు బాలింతలు ఆశ వర్కర్ మంజుల, చిన్నారులు, పాల్గొన్నారు.

# మెదక్ జిల్లా పర్యాటక ప్రాంతంగా విరజిల్లాలి

- **పర్యాటక దినోత్సవం సందర్భంగా పర్యాటక ప్రదేశాల పరిశుభ్రతకు ప్రాధాన్యత.**
- **జిల్లా అదనపు కలెక్టర్ నగేష్.**

**మెదక్, సెప్టెంబర్,23 (సిరి న్యూస్)**

పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని మెదక్ జిల్లాలోని చారిత్రక, ఆధ్యాత్మిక, ప్రకృతి పర్యాటక ప్రాంతాలను పరిశుభ్రంగా, పచ్చదనంతో, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ మెంచు నగేష్ సూచించారు. బుధవారం అదనపు కలెక్టర్ ఛాంబర్ లో పర్యాటక దినోత్సవ ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ... మెదక్ జిల్లాకు గొప్ప చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, ప్రకృతి సంపద ఉందని, జిల్లాలోని పర్యాటక ప్రాంతాలకు వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు వస్తుంటారని పేర్కొన్నారు. పర్యాటక ప్రాంతాల పరిశుభ్రతను కాపాడటం ద్వారా సందర్శకులకు మంచి అనుభూతిని కల్పించడంతో పాటు జిల్లాకు పర్యాటకంగా మరింత గుర్తింపు లభించేలా చేయవచ్చన్నారు. జిల్లాలోని మెదక్ ఖిల్లా, చర్చి, ఏడుపాయల వన దుర్గాభవాని ఆలయం, పోచారం వన్యప్రాణి అభయారణ్యం, నర్సాపూర్ అర్బన్ ఫారెస్ట్, చారిత్రక కోటలు, చెరువులు, జలపాతాలు,



దేవాలయాలు తదితర పర్యాటక ప్రదేశాల్లో ఏర్పాటు పూర్తి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ రామచంద్ర రాజు, మున్సిపల్ కమిషనర్ నవీన్, ఈడియం సందీప్, మహేందర్ , ఆర్ ఐ లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మెదక్ ఎస్పీ జన్మదిన వేడుకలు





- **ఎస్పీ జన్మదిన వేడుకల్లో అధికారులు, సిబ్బంది.**

**మెదక్ సెప్టెంబర్,23(సిరి న్యూస్)**

జిల్లా పోలీస్ కార్యాలయంలో మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బంది ఎస్పీకి పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అధికారులు, సిబ్బంది సమక్షంలో ఎస్పీ కేక్ కట్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం పోలీసు అధికారులు ఎస్పీకి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయనకు ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది చూపిన ఆత్మీయతకు కృతజ్ఞతలు తెలిపారు. పోలీసు శాఖలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ సమన్వయంతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డీఎస్పీలు ప్రసన్నకుమార్, నరేందర్ గౌడ్, సీఐ లు, ఎస్ ఐ లు,పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు అభిలాష్ జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని ఎస్పీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# మెట్రోకు లాస్ట్‌మైల్ లింక్..ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి

- **జేఎన్‌టీయూ మియాపూర్ రైదుర్గ్ మార్గంలో సమగ్ర మొబిలిటీపై కసరత్తు**
- **ఫుట్‌పాత్‌లు ఫీడర్ సేవలు పాఠశాలల వద్ద ట్రాఫిక్‌పై ప్రత్యేక చర్యలు**

**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 23 (సిరి న్యూస్):**

జేఎన్‌టీయూ,మియాపూర్,రైదుర్గ్ మెట్రో కారిడార్‌లో ప్రయాణికుల రాకపోకలను మరింత సులభతరం చేసేందుకు ట్రాఫిక్ మొబిలిటీ, లాస్ట్‌మైల్ కనెక్టివిటీపై సమగ్ర అధ్యయనానికి అధికారులు శ్రీకారం చుట్టారు. సీఎంసీ ప్రధాన కార్యాలయంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఎంసీ కమిషనర్, ఆర్టీసీ ఎండీ, సైబరాబాద్ పోలీస్ కమిషనర్, ట్రాఫిక్ విభాగం అధికారులు, జోనల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. సుమారు 8.5 కి.మీ. పరిధిలో మెట్రో స్టేషన్ల చుట్టూ ఫుట్‌పాత్‌ల పరిస్థితి, పాదచారుల క్రాసింగ్‌లు, ట్రాఫిక్ రద్దీ, ప్రమాదకర ప్రాంతాలు, ఆక్రమణలు తదితర అంశాలను గుర్తించి అవసరమైన మెరుగుదలలను సూచించనున్నారు. మెట్రో స్టేషన్ల వద్ద ప్రయాణికుల కోసం ప్రత్యేక పికప్-డ్రాప్ పాయింట్లు, ఫీడర్ ఆటోలు, ఈఆటో సేవలకు అనువైన ప్రాంతాలను గుర్తించడంతో పాటు పాఠశాలల వద్ద పీక్ అవర్ ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలను పరిశీలించనున్నారు. పాఠశాల బస్సులు, వ్యాన్లు, తల్లిదండ్రుల వాహనాల రాకపోకలతో ప్రధాన రహదారులపై రద్దీ ఏర్పడకుండా పికప్ డ్రాప్ జోన్లు, కార్‌పూలింగ్ వంటి విధానాలపై కూడా అధ్యయనం చేయనున్నారు. నడక, సైక్లింగ్, ప్రజా రవాణా, ఫీడర్ సేవలను మెట్రోతో అనుసంధానించి స్టేషన్ నుంచి చివరి గమ్యస్థానం వరకు సురక్షితమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించే సమగ్ర లాస్ట్‌మైల్ నెట్‌వర్క్ ఏర్పాటుపై దృష్టి సారించనున్నారు.




# భక్తిశ్రద్ధలతో గణనాథుడికి వీడ్కోలు

- **మల్కం చెరువులో ఘనంగా శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయ వినాయక నిమజ్జనం**

**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 23(సిరి న్యూస్):**

శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో కొలువుదీరిన గణనాథుడికి అధికారులు, సిబ్బంది భక్తిశ్రద్ధలతో వీడ్కోలు పలికారు. జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ ఐఏఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిమజ్జన వేడుకలు సందడిగా సాగాయి.జోనల్ కార్యాలయంలో కొద్ది రోజులుగా ప్రత్యేక పూజలు అందుకున్న వినాయకుడిని బుధవారం డప్పు వాయిద్యాలు, కోలాటాలు, భక్తుల నినాదాల మధ్య ఊరేగింపుగా మల్కం చెరువు వద్దకు తరలించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు, ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, శానిటేషన్ విభాగాల అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లు, కార్మికులు పాల్గొన్నారు.మల్కం చెరువు వద్ద నిమజ్జన ఘట్టం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ స్వయంగా క్రేన్‌పై వెళ్లి గణనాథుడి నిమజ్జనంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వినాయక చవితి ఐక్యత, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందని, అధికారులు, సిబ్బంది సమష్టిగా పండుగను నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. నగర అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి విఘ్నేశ్వరుడి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.నిమజ్జనం అనంతరం భక్తులు,సిబ్బందికి ప్రసాదం పంపిణీ చేశారు.



# కేపీహెచ్‌బీ వేవ్‌రాక్ మధ్య ప్రత్యేక బస్ లేన్!

- -పీక్ అవర్స్ రద్దీకి ప్రత్యామ్నాయ మార్గంపై అధికారుల పరిశీలన

**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 23(సిరి న్యూస్):**



కేపీహెచ్‌బీ నుంచి ఐటీ కారిడార్ వైపు వెళ్లే ప్రయాణికులకు ఎదురవుతున్న ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించేందుకు అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించారు. కేపీహెచ్‌బీ,వేవ్‌రాక్ మధ్య టీజీఎస్ఆర్టీసీ, ఐటీ కంపెనీల బస్సులకు ప్రత్యేక లేన్ ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలిస్తూ బుధవారం క్షేత్రస్థాయిలో ట్రయల్ నిర్వహించారు. రద్దీ సమయాల్లో బస్సులు సాధారణ వాహనాల మధ్య చిక్కుకోకుండా నిరంతరాయంగా ముందుకు సాగేలా మార్గాన్ని రూపొందించే అంశంపై అధికారులు అధ్యయనం చేశారు. ప్రత్యేక లేన్ అందుబాటులోకి వస్తే బస్సుల ప్రయాణ సమయం తగ్గడంతో పాటు ప్రధాన రహదారిపై వాహనాల ఒత్తిడి తగ్గే అవకాశాలున్నాయని అంచనా వేశారు.ఇదే సమయంలో జేఎన్‌టీయూ,బయోడైవర్సిటీ మార్గంలోనూ పీక్ అవర్స్‌లో ట్రాఫిక్ కదలికలను అధికారులు పరిశీలించారు.రహదారి సామర్థ్యం, వాహనాల ప్రవాహం, బస్సులకు ప్రత్యేక మార్గం కేటాయిస్తే ఇతర వాహనాలపై పడే ప్రభావం వంటి అంశాలను క్షేత్రస్థాయిలో అంచనా వేశారు.బస్సులు తక్కువ స్టాప్‌లతో వేగంగా ప్రయాణించే విధానంపైనా దృష్టి సారించారు. ట్రయల్ రన్‌లో సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, ట్రాఫిక్2 డీసీపీ శేషాద్రిని రెడ్డి, టీజీఎస్ఆర్టీసీ ఈడీ శ్రీధర్, ఎస్సీఎస్సీ సీఈఓ నవేద్ ఆలం ఖాన్‌తో పాటు సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు. పరిశీలనలో లభించిన వివరాల ఆధారంగా ప్రత్యేక బస్ లేన్ ఏర్పాటుపై తదుపరి నిర్ణయం తీసుకోనున్నారు.

# పీఎంఆర్ బాల గణేశునికి కమిషనర్ శివాజి పూజలు

**సదాశివపేట.సెప్టెంబర్ 23. (సిరిన్యూస్)**

పట్టణంలోని గురునగర్ కాలనీలో పీఎంఆర్ బాల గణేష్ మండపం ఆధ్వర్యంలో నిర్వహించిన చివరి పూజా కార్యక్రమానికి సదాశివపేట మున్సిపల్ కమిషనర్ తౌటం శివాజి, మున్సిపల్ ఇంజనీర్ రాజేష్, మున్సిపల్ చైర్పర్సన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరై గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పులిమామిడి రాజు దంపతులు వినాయకునికి ప్రత్యేక పూజలు చేశారు. కాలనీకి చెందిన గంట ఈశ్వరమ్మ-శివన్న దంపతులు కూడా గణేశుని చివరి కలశ పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిగీతాలు ఆలపిస్తూ మంగళహారతులు సమర్పించారు. అనంతరం పురోహితులు శివప్రసాద్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులకు 12వ వార్డు కౌన్సిలర్ పులిమామిడి మమత రాజు దంపతులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం వారికి వినాయకుని లడ్డూ ప్రసాదాన్ని అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. తదుపరి అతిథులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ తౌటం శివాజి మాట్లాడుతూ శుక్రవారం 25వ తేదీన నిర్వహించనున్న వినాయక నిమజ్జన కార్యక్రమంలో పట్టణంలోని వినాయక మండపాల నిర్వాహకులు తమ విగ్రహాలను గాంధీ చౌక్ వద్దకు తీసుకువచ్చి, మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పూజా కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం నిమజ్జనానికి తరలించాలని సూచించారు. సదాశివపేట పట్టణంలో సుమారు 80 వినాయక మండపాలు ఉన్నాయని, నిమజ్జన కార్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో రూ.10 లక్షల నిధులతో నిమజ్జనానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు ఆయన తెలిపారు. వినాయక నిమజ్జనాన్ని భక్తి శ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కనిగిరి శంకర్ గౌడ్, బస్వరాజ్, యాదయ్య, అఖిల్, మనోజ్, శ్రీనివాస్, ప్రవీణ్, సాయి, అంజి గౌడ్, నర్సింలు, విష్ణు, అనిల్, గుణాకర్, సోమ శంకర్ పాల్గొన్నారు.



# గ్రామ కంఠం స్థలానికి ఎన్‌ఓసి జాప్యం..

- మూడు నెలలుగా పంచాయతీ
- కార్యాలయం చుట్టూ తిరుగుతున్న బాధితుడు

కొల్చారం సెప్టెంబర్ 22 (సిరి న్యూస్)
. కొల్చారం మండలంలోని ఎనగండ్ల గ్రామ పంచాయతీ పరిధిలో గ్రామకంఠం స్థలానికి ఎన్వోసీ మంజూరులో జాప్యం జరుగుతోందని లంబాడి కుమార్ ఆరోపించారు. 1980లో సుమారు 20 గిరిజన కుటుంబాలకు ప్రభుత్వం రెండేకరాల స్థలం కేటాయించి, ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇండ్లు నిర్మించి ఇచ్చిందని కుమార్ తెలిపారు. అప్పట్లోనే ఆ స్థలాన్ని గ్రామకంఠంగా మార్చారని, అప్పటి నుంచి సుమారు 40ఏళ్లుగా ఆయా కుటుంబాలు అక్కడే నివాసం ఉంటున్నాయని తెలిపారు. తన తండ్రి ధనరాజ్ పేరున ఉన్న స్థలంలో పాత ఇల్లు కూలిపోవడంతో కొత్త ఇంటి నిర్మాణానికి ప్రైవేట్ బ్యాంకు రుణం కోసం ప్రయత్నించానని కుమార్ తెలిపారు. బ్యాంక్ అధికారులు గ్రామపంచాయతీ నుంచి ఎన్ఓసి తీసుకురావాలని సూచించడంతో మూడు నెలలుగా పంచాయతీ కార్యదర్శి ని సంప్రదిస్తున్నానని చెప్పారు. అయితే పాలకవర్గం తీర్మానం చేస్తేనే ఎన్వోసీ ఇస్తామని కార్యదర్శి చెప్తున్నారని ఆరోపించారు. గ్రామకంఠంగా ఉన్న స్థలాన్ని ప్రభుత్వ భూమిగా పేర్కొనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.40 ఏళ్లుగా అక్కడ నివాసం ఉంటూ పన్నులు చెల్లిస్తున్నామని, పాత ఇల్లు కూలిపోవడంతో కొత్త ఇంటి నిర్మాణానికి రుణం పొందేందుకు ఎన్ఓసి ఇవ్వాలని కోరానని తెలిపారు.




**పంచాయతీ కార్యదర్శి వివరణ..**

ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రాజా గౌడును వివరణ కోరగా దుంపలకుంటలోని సర్వే నంబర్ 331లో ప్రభుత్వ భూమి ఉందని తెలిపారు. నూతన పాలకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఎవరికి అనుమతులు ఇవ్వలేదని చెప్పారు. గ్రామపంచాయతీ తీర్మానం చేసిన అనంతరం మాత్రమే ఎన్వోసీ మంజూరు చేస్తామని కార్యదర్శి రాజు గౌడ్ స్పష్టం చేశారు.

# ఉత్తమ బోధనకు దక్కిన గౌరవం

- ప్రతిభ బడికి అవార్డుల మెరుపు

**జిన్నారం సెప్టెంబర్ 23 సిరి న్యూస్**

జిన్నారం మండల కేంద్రంలోని ప్రతిభ విద్యానికేతన్ హై స్కూల్ కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. ఈ మేరకు పటాన్చెరు నియోజకవర్గస్థాయిలో జిఎంఆర్ కన్వెన్షన్ లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూజోత్సవం కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును ప్రతిభ విద్యానికేతన్ హై స్కూల్ కు చెందిన కార్తీక్ రాజ్ అందుకున్నారు. ప్రశంసా పత్రం జ్ఞాపిక శాలువాతో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయుడిగా సన్మానం అందుకోవడం ఆనందంగా ఉందంటూ కార్తీక్ రాజ్ సంతోషం వెలిబుచ్చారు. ప్రతిభ విద్యానికేతన్ హై స్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థులను అత్యుత్తమంగా తీర్చిదిద్దుతూ వారి బంగారు భవితకు బాటలు వేస్తూ ఉత్తమ ఉపాధ్యాయులుగా సత్కారం పొందడం అభినందనీయమని ప్రతిభ విద్యానికేతన్ హై స్కూల్ ప్రిన్సిపల్ సార శ్రీనివాస్ ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు.



# అంబరాన్నంటిన బొల్లారం గణనాథుడి నిమజ్జనోత్సవం

- లడ్డు రూ.16.60 లక్షలు సొంతం చేసుకున్న సీతారాం రెడ్డి
- మణిహారమాల 7.51 లక్షలకు సొంతం చేసుకున్న ఉసుకేబావి చంద్ర రెడ్డి

**జిన్నారం సెప్టెంబర్ 23 సిరి న్యూస్**

గణేష్ నవరాత్రుల సందర్భంగా బొల్లారంలోనీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం మహా గణేశుడు నిమజ్జన కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నిమజ్జన సందర్భంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో లడ్డు వేలం పాటను నిర్వహించారు. ఏకంగా పెద్ద లడ్డు 16 లక్షల 60 వేల రూపాయలకు పులగుర్ల సీతారాంరెడ్డి దక్కించుకున్నారు. అదే విధంగా గణేశుడికి అలంకరించిన మణిహార మాలను ఉసికే బావి చంద్రారెడ్డి 7 లక్షల 51 వేలకు వేలంపాటలో సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించి లడ్డు మణిహారమాలను అందజేశారు. విశేష పూజలు అందుకున్న లడ్డు, గణపతి మణిహారమాలను సొంతం చేసుకోవడంపై సీతారాం రెడ్డి చంద్రారెడ్డిలు ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం డివిజన్లోని ప్రధాన వీధుల గుండా మహాగణపతి నిమజ్జన క్రతువును తీన్మార్ నృత్యాలు, డప్పు చప్పుళ్ల మధ్య కేరింతలు కొడుతూ మాధవానికుంటలో భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా నిమజ్జనాన్ని పూర్తి చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు యువకులు భక్తులు పాల్గొన్నారు.



# శ్రీరామ్ సేన యూత్ ఆధ్వర్యంలో కుంకుమార్చన

**సదాశివపేట. సెప్టెంబర్ 23.(సిరిన్యూస్)**

శ్రీరామ్ సేన యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా కుంకుమార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 19వ వార్డు కౌన్సిలర్ పట్లూరి రోజా నాగరాజు గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ రోజా నాగరాజు గౌడ్ మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని గణనాథుడిని ప్రార్థించినట్లు తెలిపారు. యువత ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ సేన యూత్ సభ్యులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కుంకుమార్చనలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.



# సంకేత భాషతో సమగ్ర సమాజం నిర్మిద్దాం



- ప్రధానోపాధ్యాయులు కే .ఉపేందర్ రెడ్డి

**కొల్చారం, సెప్టెంబర్ 23 (సిరి న్యూస్)**

కొల్చారం మండలంలోని రంగంపేట జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో అంతర్జాతీయ సంకేత భాషల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రార్థనా సభలో సంకేత భాష ప్రాముఖ్యత, వినికిడి లోపం ఉన్న వ్యక్తుల హక్కులు, సమగ్ర విద్యపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక విద్యా ఉపాధ్యాయులు జాధవ్ ఓంప్రకాష్ సంకేత భాషపై విద్యార్థులకు వివరించారు. సాధారణంగా ఉపయోగించే సంకేత భాషలను పరిచయం చేస్తూ నమస్కారం, శుభోదయం, ధన్యవాదాలు, స్వాగతం, స్నేహితుడు తదితర సంకేతాలను ప్రదర్శించారు. సంకేత భాషను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, వినికిడి లోపం ఉన్న వ్యక్తులతో సులభంగా సంభాషించేందుకు ప్రయత్నించాలని సూచించారు. వైకల్యం ఉన్న, లేని విద్యార్థులందరూ సమాన అవకాశాలతో కలిసి నేర్చుకునేలా సమగ్ర విద్యను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సంకేత భాషను నేర్చుకుందాం.. అందరితో సమానంగా సంభాషిద్దాం.. సమగ్ర సమాజాన్ని నిర్మిద్దాం. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపేందర్ రెడ్డి,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రూ.5 లక్షలు దాటిన లడ్డు వేలం



**అమీన్పూర్ సెప్టెంబర్ 23 సిరి న్యూస్**

అమీన్ పూర్ సర్కిల్ పరిధిలోని వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బంధం కొమ్ము క్రిష్ణ బృందావన్ కాలనీ విజయ గణపతి ఆలయం వద్ద గణపతి లడ్డు 5 లక్షలు దాటిన లడ్డు వేలం,మడపు ఫామ్స్ అధినేతలు మడపు రోహిత్ రెడ్డి,రాహుల్ రెడ్డి లు కైవసం చేసుకున్నారు. ఎంతో పవిత్రమైన లడ్డును సొంతం చేసుకోవడం అదృష్టంగా ఉందని, కె బి సి కాలనీవాసులు తమకు కుటుంబంతో సమానమని విజేతలు రోహిత్ రెడ్డి,రాహుల్ రెడ్డి అన్నారు. ఈ వేలం కార్యక్రమంలో కెబిసి కాలనీ పాలక వర్గం ప్రవీణ్ రెడ్డి, ఉదయ్ రెడ్డి, యోగేందర్ రెడ్డి, త్రినాథ్ బాబు, శరత్ రెడ్డి, రేవంత్ పాటు ఆలయ కమిటీ సభ్యులు తుమ్మల బలరాం రెడ్డి, సత్య రెడ్డి... కాలనీ వాసులు పాల్గొన్నారు

# రూ.50 వేలు పలికిన ఎన్ఎస్ఎల్ కాలనీ వినాయక లడ్డు



- పోటీపడి లడ్డు దక్కించుకున్న ఈశ్వర్ రావు

**అమీన్పూర్ సెప్టెంబర్ 23 సిరి న్యూస్**

అమీన్‌పూర్ జిహెచ్ఎంసి పరిధిలోని ఎన్ఎస్ఎల్ కాలనీలో నిర్వహిస్తున్న వినాయక ఉత్సవాలు 37వ సంవత్సరానికి చేరుకున్నాయి. ఈ సందర్భంగా వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డూ వేలం పాటలో తొలిసారిగా రూ.50 వేల రికార్డు ధర నమోదైంది.వేలం పాటలో ఈశ్వర్‌రావు, ఆయన కుటుంబ సభ్యులు రూ.50 వేలకు వినాయక లడ్డూను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు దారా ఈశ్వర్‌రావు కుటుంబ సభ్యులను అభినందించారు. ఎన్ఎస్ఎల్ కాలనీలో 37 ఏళ్లుగా కొనసాగుతున్న వినాయక ఉత్సవాలకు స్థానిక ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని కమిటీ సభ్యులు తెలిపారు. భక్తుల సహకారంతో ఈ ఏడాది ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

# దౌల్తాబాద్‌లో వినాయక లడ్డూలకు భారీగా వీలంపాటలు పలికాయి..

**హత్నూర, సెప్టెంబర్ 23 (సిరి న్యూస్):**

దౌల్తాబాద్‌లో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన లడ్డూ వేలం పాటలు భక్తుల సందడి మధ్య ఉత్సాహంగా సాగాయి. పలు వినాయక మండపాల వద్ద నిర్వహించిన వేలం పాటల్లో భక్తులు పోటాపోటీగా పాల్గొన్నారు. దౌల్తాబాద్‌లోని కొన్యాల కృష్ణ వినాయక చౌక్ లడ్డూను రూ.1.82 లక్షలకు కొన్యాల కృష్ణ దక్కించుకున్నారు. అదేవిధంగా హిందూ వాహిని యూత్ ఆధ్వర్యంలోని వినాయక లడ్డూను రాజు గౌడ్ స్వామి రూ.8 లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. ఈ వేలం పాటలో భారీ మొత్తానికి లడ్డూ దక్కడం స్థానికంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శ్రీ సాయి యూత్ ఆధ్వర్యంలోని వినాయక లడ్డూను రామగిరి రాజేశ్వర్ కుమారుడు రూ.61 వేలకు దక్కించుకున్నారు. లడ్డూ వేలం పాటలను వీక్షించేందుకు స్థానికులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వేలం అనంతరం నిర్వా హకులు విజేతలను అభినందించారు. వినాయక ఉత్సవాల సందర్భంగా భక్తుల మధ్య సోదరభావం, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.



# రామాయంపేటలో ఘనంగా వినాయక నిమజ్జన వేడుకలు





- 56వ సంవత్సరం ఉత్సవాల్లో భక్తుల సందడి..
- రూ.13 వేలకే లడ్డూ ప్రసాదం

**రామాయంపేట, సెప్టెంబర్ 23 (సిరి న్యూస్)**

రామాయంపేట పాండ చెరువు కట్టపై శ్రీ కళ్యాణ రామచంద్రస్వామి దేవాలయం వద్ద దత్తాత్రేయ యువజన సంఘం ఆధ్వర్యంలో 56వ సంవత్సరం వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజులపాటు గణనాథుడికి ప్రత్యేక పూజలు, భక్తి కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం బుధవారం నిమజ్జన వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు రంగురంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గణనాథుడిని ప్రతిష్ఠించి, భక్తుల భక్తిశ్రద్ధల నడుమ ఊరేగింపు నిర్వహించారు. నిమజ్జన వేడుకల్లో కళాకారుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వరంగల్ నుంచి వచ్చిన ప్రత్యేక కళాకారుల బృందం పాటలు పాడుతూ, డప్పులు వాయిస్తూ, నృత్యాలతో భక్తులను ఉత్సాహపరిచింది. దీంతో పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి.

**రూ.13 వేలకు లడ్డూ వేలం**

వినాయకుడి లడ్డూ ప్రసాదానికి నిర్వహించిన వేలంపాటలో
భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చివరకు నక్క సిద్ధ రాములు అనే భక్తుడు రూ.13,000లకు లడ్డూను వేలంలో దక్కించుకున్నారు. లడ్డూ ప్రసాదం దక్కించుకోవడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. వినాయక నిమజ్జన వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని "గణపతి బప్పా మోరియా" అంటూ భక్తి శ్రద్ధలతో గణనాథుడికి వీడ్కోలు పలికారు. నిర్వాహకులు, యువజన సంఘం సభ్యులు వేడుకలను విజయవంతంగా నిర్వహించారు.



# 30న జాబ్‌మేలా

- 50 ఫార్మసిస్ట్, అసిస్టెంట్ ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 23:**

ఉస్మానియా యూనివర్సిటీలోని ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో అపోలో ఫార్మసీ ఈనెల 30న ఉదయం 11 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నది. ఉస్మానియా యూనివర్సిటీ, ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో ఈ మేలా జరుగుతుంది. దీని ద్వారా అపోలో ఫార్మసీలోని ఫార్మసిస్టు, అసిస్టెంట్ ఫార్మసిస్ట్ 50 పోస్టులను భర్తీ చేయనున్నారు. డీ ఫార్మసీ, బీ ఫార్మసీ, ఎం.ఫార్మసీ, డిగ్రీ చేసిన 18 నుండి 35 సంవత్సరాల వయసు వారికి మాత్రమే అవకాశం కల్పిస్తున్నట్లు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (యూఈఐ అండ్ జీబీ/ఎంసీసీ) ఒక ప్రకటనలో తెలియజేసింది. రూ.16,583 నుండి రూ.25,000 వేల వరకు వేతనం ఉండే ఈ ఉద్యోగాలకు సంబంధించి మరిన్ని వివరాలకు టి.రఘుపతి, హెచ్ఆర్ ఫోన్: 8247656356 నందు సంప్రదించాలని కోరింది. విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్‌తో ఉస్మానియా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరో వద్ద నేరుగా సెప్టెంబర్ 30న హాజరు కావాలన్నది.




# సర్ పై మమత తీవ్ర ఆరోపణలు

- ఈసీ అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించిందని ఆరోపణ • ఎస్ఐఆర్ జరిగిన రాష్ట్రాల్లో రీపోలింగ్ జరపాలని డిమాండ్
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై క్రిమినల్ కేసులు పెట్టాలని వ్యాఖ్య
- బెంగాల్ ఎన్నికలను మళ్లీ నిర్వహించాలని డిమాండ్
- ఈసీలో అంతర్గత విభేదాలున్నాయన్న 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం
- ఆరోపణలను ఖండించిన ఎన్నికల సంఘం

**కోల్‌కతా, సెప్టెంబరు 23:**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR)పై 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో వచ్చిన నివేదిక నేపథ్యంలో పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ఎన్నికల సంఘంపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల సంఘం అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించిందని ఆమె ఆరోపించారు. SIR నిర్వహించిన అన్ని రాష్ట్రాల్లో రీపోలింగ్ చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను అరెస్టు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మమత కోరారు. ఆయన పర్యవేక్షణలో ఎన్నికలు జరిగిన ప్రాంతాల్లో మళ్లీ పోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. తమ ఫిర్యాదులపై ప్రధాన న్యాయమూర్తిని ఆశ్రయించామని, ప్రజల అభ్యంతరాలను న్యాయవ్యవస్థ పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు.

కాగా, SIRపై ఈసీలో అంతర్గత విభేదాలు ఉన్నట్లు 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం ప్రచురించింది. అయితే ఈ ఆరోపణలను ఎన్నికల సంఘం ఖండించింది. SIR సహా అన్ని తుది నిర్ణయాలు ముగ్గురు ఎన్నికల కమిషనర్ల ఏకగ్రీవ ఆమోదంతోనే తీసుకున్నామని స్పష్టం చేసింది.

# ధరలకు కళ్లెం వేసేందుకు కేంద్రం కీలక నిర్ణయం

- వంటనూనెలపై దిగుమతి సుంకం తగ్గింపు
- క్రూడ్ సోయాబీన్, పామ్ ఆయిల్‌పై డ్యూటీ 10% నుంచి 5%కి తగ్గింపు
- రిఫైండ్ సోయాబీన్, పామ్ ఆయిల్‌పై 32.5% నుంచి 27.5%కి కోత
- క్రూడ్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై 10% సుంకం పూర్తిగా రద్దు
- రిఫైండ్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై డ్యూటీ 22.5%కి తగ్గింపు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:**

దేశీయ మార్కెట్‌లో వంటనూనెల ధరలను నియంత్రించే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పలు రకాల వంటనూనెలపై దిగుమతి సుంకాన్ని తగ్గిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. క్రూడ్ సోయాబీన్, క్రూడ్ పామ్ ఆయిల్‌పై ప్రాథమిక కస్టమ్స్ డ్యూటీని 10 శాతం నుంచి 5 శాతానికి తగ్గించింది. రిఫైండ్ సోయాబీన్, పామ్ ఆయిల్‌పై సుంకాన్ని 32.5 శాతం నుంచి 27.5 శాతానికి కుదించింది. సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై మరింత ఊరట కల్పించింది. క్రూడ్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై ఉన్న 10 శాతం కస్టమ్స్ డ్యూటీని పూర్తిగా రద్దు చేయగా.. రిఫైండ్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై సుంకాన్ని 32.5 శాతం నుంచి 22.5 శాతానికి తగ్గించింది. సవరించిన రేట్లు రేపటి నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి.

# అశ్వాపురం ప్రాంతంలో గోదావరి జలాల పరుగులు

- మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభం
- తుమ్మల చెరువులోకి నీరు విడుదల చేసిన మంత్రులు తుమ్మల, పొంగులేటి
- తొలి విడతలో 4,300 ఎకరాలకు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల వెల్లడి

**అశ్వాపురం, సిరి న్యూస్, సెప్టెంబర్ 23 :**

రైతుల చిరకాల స్వప్నాన్ని సాకారం చేస్తూ అశ్వాపురం మండలం మారేళ్లపాడులో ఎత్తిపోతల పథకాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు బుధవారం ప్రారంభించారు. పంపులను ఆన్ చేసి గోదావరి జలాలను తుమ్మల చెరువుకు విడుదల చేసి పథకాన్ని జాతికి అంకితం చేశారు. సుమారు రూ.610 కోట్లతో చేపట్టిన ఈ పథకం ద్వారా తొలి విడతలో 4,300 ఎకరాలకు, దశలవారీగా అశ్వాపురం మండలంలో 22 నుంచి 23 వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నారు. ఈ సందర్భంగా గొందిగూడెంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ తుమ్మల చెరువుకు గోదావరి జలాలు అందించాలన్న అశ్వాపురం ప్రాంత రైతుల చిరకాల కోరిక నెరవేరిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంతో సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసి అశ్వాపురం, పినపాక ప్రాంతం నుంచి గోదావరి జలాలను పాలేరు వరకు తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కాల్వల నిర్మాణానికి అవసరమైన అదనపు నిధులను ముఖ్యమంత్రి మంజూరు చేశారని మంత్రి తెలిపారు. ఇల్లెందు నియోజకవర్గానికి సాగునీరు అందించేందుకు జూలూరుపాడు టన్నెల్, లలితాపురం వద్ద ఎత్తిపోతల పథకం తదితర అంశాలపై సర్వేలు నిర్వహించి సవరించిన అంచనాలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. అన్నదైవం ప్రాజెక్టుకు కూడా గోదావరి జలాలను విడుదల చేస్తున్నామని తెలిపారు. కాల్వల భూసేకరణలో రైతులు సహకరించాలని, భూములు కోల్పోయే వారికి పరిహారం అందించాలని అధికారులను ఆదేశించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా సుమారు పది నియోజకవర్గాల్లో సాగునీటి విస్తరణకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. భద్రాచలం నియోజకవర్గంలో ప్రగళ్లపల్లి ఎత్తిపోతల పథకాన్ని చేపట్టి పాలెంవాగు, తాలిపేరు, మోడికుంటవాగు వంటి ప్రాజెక్టులతో అనుసంధానం చేస్తే మరిన్ని మండలాలకు సాగునీరు అందే అవకాశం ఉంటుందని చెప్పారు. పులుసుబొంత్ ప్రాంతంలో అటవీ అనుమతులు, ప్రత్యామ్నాయ భూముల గుర్తింపు వంటి సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో సాధ్యమైన ప్రాంతాల్లో చిన్న బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లను ఏర్పాటు చేసి గోదావరి జలాలను నిల్వ చేయాలని సూచించారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని మంత్రి తుమ్మల రైతులకు సూచించారు. అశ్వారావుపేట, పినపాక ప్రాంతాల్లో ఆయిల్‌పామ్ సాగుపై రైతుల్లో ఆసక్తి పెరుగుతోందని మంత్రి తుమ్మల తెలిపారు.

**నిరుద్యోగులు, యువత సంక్షేమానికి భరోసా : మంత్రి పొంగులేటి**

ప్రజా ప్రభుత్వం పేదలు, రైతులు, గిరిజనులు, మహిళలు, నిరుద్యోగులు, యువత సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రైతు రుణ మాఫీ, రైతు భరోసా, సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. గత 30 నెలల్లో సుమారు 72 వేల ఉద్యోగాలు భర్తీ చేసినట్లు చెప్పారు. పులుసుబొంత్ ప్రాజెక్టుకు సంబంధించి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి త్వరలో టెండర్లు పిలిచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల తదుపరి దశల్లో గిరిజన ప్రాంతాల్లో గుడిసెల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. సన్న బియ్యం పంపిణీ, రేషన్ కార్డులు, విద్య, వైద్య రంగాల్లో ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందన్నారు. మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు విస్తరించడంతో రోజుకు సుమారు 450 నుంచి 500 మంది వరకు సేవలు పొందుతున్నారని తెలిపారు.

**రైతులకు పండుగ వాతావరణం : ఎంపీ బలరాంనాయక్**



ఎంపీ పోరిక బలరాంనాయక్ మాట్లాడుతూ మారేళ్లపాడు ఎత్తిపోతల ద్వారా అశ్వాపురం మండలంలోని సుమారు 24 గ్రామాలతోపాటు ఇతర మండలాలకు కూడా సాగునీరు అందించే అవకాశం ఏర్పడిందన్నారు. గోదావరి జలాలు తుమ్మల చెరువుకు చేరుకోవడం రైతులకు పండుగ వాతావరణాన్ని కల్పించిందన్నారు. 2005 డిసెంబర్ 31న దుమ్ముగూడెం రాజీవ్‌సాగర్ ప్రాజెక్టుకు పునాది వేసినప్పటి నుంచి జరిగిన పరిణామాలను వివరించారు. రాష్ట్రం ఏర్పడిన అనంతరం ప్రాజెక్టు రూపకల్పనలో మార్పులు చేసి సీతారామ ప్రాజెక్టుగా అభివృద్ధి చేశారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 2025 ఆగస్టు 15న సీతారామ ఎత్తిపోతలను ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. అశ్వాపురం మండలంలో కుడి కాలువ పనులకు సుమారు రూ.130 కోట్లతో పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. చింతకుంట, జగ్గారం పరిధిలోని ఎర్రబోకల చెరువు, మిట్టగూడెం పరిధిలోని లోయర్ చెరువుతోపాటు అనుసంధాన చెరువులకు నీరు అందించేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కుడి కాలువ ద్వారా తొమ్మిది గ్రామ పంచాయతీలకు నీరు అందించి సుమారు 11,981 ఎకరాల కమాండ్ ఏరియాను స్థిరీకరించే అవకాశం ఉందన్నారు. కుడి, ఎడమ కాలువల ద్వారా 24 గ్రామ పంచాయతీల పరిధిలోని 68 గ్రామాలకు, సుమారు 13,037 కుటుంబాలకు, దాదాపు 24 వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందని తెలిపారు. తుమ్మల చెరువు ప్రధాన కాలువను బలోపేతం చేసి కాంక్రీట్ లైనింగ్‌తో పాటు సుమారు 22 కిలోమీటర్ల డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మంత్రులను కోరారు. గొందిగూడెం, వెంకటాపురం వంటి గిరిజన గ్రామాలకు కూడా సాగునీరు అందించాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, జారే ఆదినారాయణ, ఎస్పి రోహిత్ రాజు, జిల్లా అటవీ అధికారి సిధార్ధ్ విక్రమ్ సింగ్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, నీటిపారుదల శాఖ ఎస్ఈ శ్రీనివాస రెడ్డి ప్రజాప్రతినిధులు, సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

**దక్షిణ అయోధ్యగా అభివృద్ధి చేయాలనేది లక్ష్యం**

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధికి ముఖ్యమంత్రి హామీ మేరకు రూ.350 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించామని తెలిపారు. పుష్కరాల నాటికి సాధ్యమైనంత మేరకు పనులు పూర్తి చేసి భద్రాచలాన్ని దక్షిణ అయోధ్యగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రహదారులు, సాగునీరు, విద్య, వైద్య రంగాల్లో జిల్లాను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

# ఎన్నికల కమిషనర్ల నియామకంపై సుప్రీంకోర్టులో భిన్న తీర్పు

- 2023 చట్టాన్ని సవాల్ చేసిన పిటిషన్లపై ఇద్దరు న్యాయమూర్తుల విభేదం
- ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనానికి బదిలీపై ఏకాభిప్రాయం కుదరని వైనం
- కేసును విస్తృత ధర్మాసనానికి పంపాలన్న జస్టిస్ ఎస్‌సీ శర్మ
- రిఫర్ చేయాల్సిన అవసరం లేదన్న జస్టిస్ దీపాంకర్ దత్తా
- సీఈసీ, ఈసీల నియామకంలో సీజేఐ తొలగింపుపైనే ప్రధాన అభ్యంతరం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:**

ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన 2023 చట్టాన్ని సవాల్ చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టులో బుధవారం భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ కేసును ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేయాలా? వద్దా? అనే అంశంపై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఎస్‌సీ శర్మ ఏకాభిప్రాయానికి రాలేదు. 2023 చట్టం ప్రకారం సీఈసీ, ఈసీల ఎంపిక కమిటీలో ప్రధానమంత్రి, కేంద్ర మంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత సభ్యులుగా ఉంటారు. గతంలో ఈ ప్రక్రియలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పాత్ర ఉండగా.. కొత్త చట్టంలో సీజేఐని తొలగించడాన్ని పిటిషనర్లు సవాల్ చేశారు. కేసును ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనానికి పంపాలన్న అభ్యర్థనను జస్టిస్ దీపాంకర్ దత్తా తిరస్కరించగా.. జస్టిస్ ఎస్‌సీ శర్మ మాత్రం విస్తృత ధర్మాసనానికి రిఫర్ చేయాలని అభిప్రాయపడ్డారు. దీంతో ఇది స్ప్లిట్ వెర్డిక్ట్‌గా మారింది. తదుపరి ప్రక్రియలో ఈ భిన్నాభిప్రాయాలను పరిష్కరించాల్సి ఉంటుంది. ఎన్నికల కమిషనర్ల నియామక విధానం రాజ్యాంగబద్ధత, ఎంపిక కమిటీ నుంచి సీజేఐ తొలగింపు వంటి అంశాలు ఈ కేసులో కీలకంగా మారనున్నాయి.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.

# ప్రజా సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తేవాలి

## ‘సిరి’ సామాన్యుల గొంతుక కావాలి

- ప్రజలకు, ప్రభుత్వ యంత్రాంగానికి మధ్య మీడియా బలమైన వారధి
- సంగారెడ్డి అభివృద్ధికి కృషి చేస్తున్న సిరి యాజమాన్యానికి అభినందనలు
- ‘సిరి టీవీ’ ఛానల్ మరియు సిరి మీడియా హౌస్ సందర్శన

జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్య రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ సీడీసీ చైర్మన్ బుచ్చిరెడ్డి



5

www.siridaily.com

RNI TG TEL/ 26/A0381

సిరి

People's Voice వార్తపత్రిక

గురువారం
సెప్టెంబర్-24-2026

సంపుటి (Volume) : 2
సంచిక (Issue) 259

పేజీలు : 6




# టౌన్ ప్లానింగ్ కాదు వసూళ్ల ప్లానింగ్!?



- ‘ప్రైవేట్ సైన్యం’తో వసూళ్ల దందా ?
- చైన్‌మెన్ అండతో ఇద్దరు ‘వసూళ్ల రాజాలు’
- కట్టడాల వద్ద బెదిరింపులు, సెటిల్‌మెంట్లు
- నిబంధనలు పాతిపెట్టి అక్రమార్జన
- ప్రశ్నిస్తే ‘ఐ డోంట్ కేర్’ అంటూ హుకుం
- కింది నుంచి పైదాకా ముడుతున్న మామూళ్లు
- కళ్లప్పగించి చూస్తున్న ఉన్నతాధికారులు

## సర్కిల్-49లో టిపిఎస్ లదే సామ్రాజ్యం

రాజధాని నగరంలో క్రమబద్ధమైన అభివృద్ధిని పర్యవేక్షించి, అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాల్సిన జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం కొందరి స్వప్రయోజనాలకు అడ్డాగా మారుతోంది. శేరిలింగంపల్లి సర్కిల్-49 టౌన్‌ప్లానింగ్ విభాగంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఇప్పుడు స్థానికంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. ప్రజాధనాన్ని, ప్రజా ప్రయోజనాలను కాపాడాల్సిన అధికారులే నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి, కిందిస్థాయి సిబ్బందిని, ప్రైవేటు వ్యక్తులను రంగంలోకి దించి సాగిస్తున్న ‘మామూళ్ల’ దందాపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సర్కిల్‌లో పనిచేస్తున్న టిపిఎస్ (టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్) తీరుపై స్థానిక ప్రజలు, బిల్డర్ల నుంచి తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తమవుతోంది.

2

శేరిలింగంపల్లి, (సిరి న్యూస్):



5

# పెండింగ్ అభివృద్ధి పనులు పూర్తి చేసేలా ఆదేశించాలి

- దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయించాలి
- ప్రహరీ గోడలు లేని పాఠశాలలకు రక్షణ గోడలు నిర్మించాలి
- కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేసిన సంగారెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్ రావు



# అభివృద్ధికి ఆమడ దూరం !

- విలీన గ్రామాల్లో కానరాని పనులు
- 10వ వార్డు వెంకటాపూర్ ప్రజల అవస్థలు
- విలీనం వద్దన్నా వినలేదు.. అభివృద్ధి ఊసే లేదు
- బ్రాహ్మణపల్లి పంచాయతీ విలీనంపై అభ్యంతరాలను పట్టించుకోలేదు



6

### ఆధ్యాత్మికత, ఐక్యత

# సామాజిక బాధ్యత

మాధవ్ నగర్ కాలనీలో నేడే ఘనంగా నిమజ్జనం

ఏడేళ్ళు గా కొనసాగుతున్న ఉత్సవాలు



3




# టౌన్ ప్లానింగ్ కాదు వసూళ్ల ప్లానింగ్!?

## సర్కిల్-49లో టిపిఎస్ లదే సామ్రాజ్యం

- 'ప్రైవేట్ సైన్యం'తో వసూళ్ల దందా ?
- చైన్‌మెన్ అండతో ఇద్దరు 'వసూళ్ల రాజాలు'
- కట్టడాల వద్ద బెదిరింపులు, సెటిల్‌మెంట్లు
- నిబంధనలు పాతిపెట్టి అక్రమార్జన
- ప్రశ్నిస్తే 'వి డోంట్ కేర్' అంటూ హుకుం
- కింది నుంచి పైదాకా ముడుతున్న మామూళ్లు
- కళ్లప్పగించి చూస్తున్న ఉన్నతాధికారులు

**శేరిలింగంపల్లి, (సిరి న్యూస్):** రాజధాని నగరంలో క్రమబద్ధమైన అభివృద్ధిని పర్యవేక్షించి, అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాల్సిన జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం కొందరి స్వప్రయోజనాలకు అడ్డాగా మారుతోంది. శేరిలింగంపల్లి సర్కిల్-49 టౌన్‌ప్లానింగ్ విభాగంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు ఇప్పుడు స్థానికంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. ప్రజాధనాన్ని, ప్రజా ప్రయోజనాలను కాపాడాల్సిన అధికారులే నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి, కిందిస్థాయి సిబ్బందిని, ప్రైవేటు వ్యక్తులను రంగంలోకి దించి సాగిస్తున్న 'మామూళ్ల' దందాపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సర్కిల్‌లో పనిచేస్తున్న టిపిఎస్ (టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్) తీరుపై స్థానిక ప్రజలు, బిల్డర్ల నుంచి తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తమవుతోంది. జీహెచ్ఎంసీ నిబంధనలతో పనిలేకుండా తన సొంత ఆదేశాలే చట్టమన్నట్లుగా సదరు అధికారి వ్యవహరిస్తుండడం గమనార్హం. మొత్తం సర్కిల్‌ను తన గుప్పెట్లో ఉంచుకుని ఏకచత్రాధిపత్యం చెలాయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన స్థానంలో ఉన్న ఈ అధికారి.. కిందిస్థాయి చైన్‌మెన్‌ను తన స్వప్రయోజనాల కోసం వాడుకుంటూ అక్రమార్జనకు రాజమార్గం సుగమం చేసుకుంటున్నారన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. సాధారణంగా పెద్ద సర్కిళ్లలో డివిజన్లవారీగా పనులు వర్గీకరించి పర్యవేక్షిస్తారు. కానీ సర్కిల్-49 పరిధిలోని అన్ని డివిజన్లకూ ఒకే ఒక్క చైన్‌మెన్‌ను కొనసాగిస్తుండడం వెనుక పెద్ద వ్యూహమే ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సదరు టిపిఎస్ ఆశీస్సులతో ఈ చైన్‌మెన్ సర్కిల్ మొత్తంలో తన హవా కొనసాగిస్తున్నాడనే ప్రచారం సాగుతోంది. పేరుకే చైన్‌మెన్ ఉద్యోగి అయినా.. క్షేత్రస్థాయిలో మాత్రం అధికారికి నమ్మకమైన 'కలెక్షన్ మేనేజర్'గా వ్యవహరిస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ తంతంగంలో అత్యంత దారుణమైన విషయమేమిటంటే.. అధికారికంగా ఎలాంటి హోదా, జీతం లేని ఇద్దరు ప్రైవేట్ వ్యక్తులను చైన్‌మెన్ తన వెంట తిప్పుకుంటున్నాడు. సర్కిల్ పరిధిలో ఎక్కడైనా కొత్తగా నిర్మాణం ప్రారంభమైనా లేదా స్లాబ్ పడుతున్నా ఈ ప్రైవేటు సైన్యం క్షణాల్లో అక్కడ ప్రత్యక్షమవుతోంది. అనుమతులు సరిగా లేవంటూ యజమానులను, బిల్డర్లను భయభ్రాంతులకు గురిచేయడం, పనులు నిలిపివేయిస్తామని బెదిరించడం, ఆపై రహస్య ప్రదేశాల్లో సెటిల్‌మెంట్ల పేరుతో భారీగా కాసులు గుంజడం నిత్యకృత్యంగా మారిందనే ప్రచారం సాగుతోంది.

### నోటీసులు ఆపై కాసులు

నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకుని పర్మిషన్లు పొందిన సామాన్యులకు సవాలక్ష నోటీసులు ఇస్తూ చుక్కలు చూపిస్తున్న ఈ అధికారులు, మామూళ్లు ఇచ్చే అక్రమార్కులకు మాత్రం సైలెంట్‌గా గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. ఈ అక్రమాలపై బాధితులు గానీ, స్థానికులు గానీ ప్రశ్నిస్తే సదరు టిపిఎస్ అండ్ టీమ్ 'వి డోంట్ కేర్' అంటూ బాహాటంగానే అలసత్వం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తమను ఎవరు ఏమీ చేయలేరన్న ధీమాతో రెచ్చిపోతూ బాధితులపై సీరియస్ అవుతుండడం వీరి నిరంకుశత్వానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇంత బహిరంగంగా ప్రైవేటు వ్యక్తులతో దందా సాగిస్తున్నా, ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం వెనుక పెద్ద కథే ఉందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. సదరు టిపిఎస్ ఆధ్వర్యంలో వసూలు అవుతున్న అక్రమ సంపాదనలో కింది స్థాయి నుంచి పైస్థాయి అధికారుల వరకు నెలవారీ మామూళ్లు సమపాళ్లలో ముడుతుండడమే ఈ మౌనానికి కారణమని విశ్వసనీయ వర్గాల సమాచారం.



### పత్తాలేని విజిలెన్స్ అధికారులు...

సర్కిల్-49ని వసూళ్ల అడ్డాగా మార్చిన టిపిఎస్ ఏకచత్రాధిపత్యంపై, చైన్‌మెన్ ఆగడాలపై జోనల్ కమిషనర్ తక్షణమే విజిలెన్స్ విచారణ జరిపించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రైవేట్ మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అధికారిక హోదా లేకుండా బిల్డర్లను బెదిరిస్తున్న ఆ ఇద్దరు ప్రైవేట్ వ్యక్తులపై కేసు నమోదు చేసి, ఈ ముఠా వెనుక ఉన్న సూత్రధారుల ముసుగు తొలగించాలని కోరుతున్నారు. లేకపోతే టౌన్‌ప్లానింగ్ విభాగంపై ప్రజలకు నమ్మకం పోవడమే కాకుండా, సిఎంసి కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ప్రజా ఆందోళనలు చేపడతామని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ఫిర్యాదులు వస్తే చర్యలు తీసుకుంటాం... టౌన్ ప్లానింగ్ ఇంచార్జి ఏసీపీ ప్రసీద

ఎవరైనా సిబ్బంది వసూళ్ళకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. బాధితులు నిర్భయంగా తమకు ఫిర్యాదు చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. అక్రమాలను ప్రోత్సహించే ప్రసక్తి లేదని, అధికారులు, సిబ్బంది వారికి సహకరిస్తే ఊరుకునే ప్రసక్తి లేదు.



# ఆధ్యాత్మికత, ఐక్యత
# సామాజిక బాధ్యత





### మాధవ్ నగర్ కాలనీలో నేడే ఘనంగా నిమజ్జనం

## ఏడేళ్ళు గా కొనసాగుతున్న ఉత్సవాలు

కే వి రవీందర్,
సిరి న్యూస్, పెద్ద శంకరం పేట

**2019లో మొదలై, 2020లో కరోనా కారణంగా ఒక్క ఏడాది మాత్రమే ఆగి, అప్పటి నుంచి నేటి వరకు క్రమం తప్పకుండా సాగుతున్న పెద్ద శంకరం పేట-మాధవనగర్ కాలనీ వినాయక నవరాత్రి ఉత్సవాలు, కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమం కాదు; అది ఆ కాలనీ మహిళల ఐక్యత, నిబద్ధత, సామాజిక బలానికి నిలువెత్తు నిదర్శనం.**

### సామాజిక ఐక్యతకు ప్రతీక

ఈ ఉత్సవాల ప్రధాన ఆకర్షణ——కాలనీకి చెందిన సుమారు 200 మంది మహిళలు నిత్యం జరిగే పూజలకు హాజరు కావడం. నిత్య పూజల్లో ఇంతమంది మహిళలు పాల్గొనడం అంటే, కాలనీ స్థాయిలో ఒక సజీవమైన ఆధ్యాత్మిక-సామాజిక వేదిక ఏర్పడిందని అర్థం. ఇటువంటి కార్యక్రమాలు కాలనీ ప్రజలను, మహిళలను, యువతను ఐక్యం చేసే సామాజిక వేదికలుగా నిలుస్తాయని పలు చోట్ల ఎమ్మెల్యేలు, నాయకులు కూడా అభిప్రాయపడ్డారు. ఇప్పటికీ ఈ మండపం వద్దకు పలువురు ప్రజా ప్రతినిధులు కూడా వచ్చి పూజల్లో పాల్గొన్నారు.

### కొనసాగుతున్న సంప్రదాయం

2019 నుంచి ప్రారంభమైన ఈ నవరాత్రి ఉత్సవాలు, 2020లో కరోనా వల్ల ఒక్క ఏడాది మాత్రమే ఆగిపోయాయి; తర్వాత ఏడాది ఏడాదిగా క్రమం తప్పకుండా నిర్వహించ బడుతున్నాయి. ఇలాంటి నిరంతరాయత, కాలనీ వాసుల్లో ఉన్న నిబద్ధత, సంప్రదాయం పట్ల గౌరవాన్ని చాటుతుంది. వినాయక నవరాత్రుల్లో ప్రతిరోజూ వేర్వేరు అవతార వినాయకులను ఆవాహన చేసి, నైవేద్యాలతో పూజించే సంప్రదాయం కూడా ఇక్కడ పాటించ బడుతోందని సందర్భోచితంగా చెప్పవచ్చు.

### మహిళా సామర్థ్యానికి నిలువెత్తు సాక్ష్యం

200 మంది మహిళలు నిత్యం పూజలకు హాజరు కావడం అంటే, కాలనీ స్థాయిలో మహిళలు ఒక పెద్ద సమూహంగా సంఘటితమయ్యారని, ఆధ్యాత్మిక కార్యకలాపాల ద్వారా సామాజిక బంధాన్ని బల పరుచుకుంటున్నారని అర్థం. ఇటువంటి మహిళా సమూహాలు కుంకుమార్చన, ఉండ్రాళ్ల నివేదన వంటి కార్యక్రమాల్లో కూడా చురుకుగా పాల్గొంటున్నట్లు ఇతర ప్రాంతాల్లోని వార్తల్లో కూడా కనిపిస్తుంది. కాలనీలో గణేష్ వద్ద మహిళలు పెద్ద ఎత్తున ముందుకు వచ్చి రోజుకు ఒక కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

### మహిళల హాజరు

పెద్ద శంకరంపేట పట్టణంలో అత్యధికంగా వినాయక పూజకు మహిళలు హాజరయ్యేది మాధవ్ నగర్ కాలనీ లోనే అని చెప్పవచ్చు. సుమారు 200 మందికి పైగా మహిళలు పూజకు ప్రతిరోజు హాజరవుతారు. ప్రత్యేక రోజుల్లో అయితే 2000 మంది వరకు మహిళలు హాజరవుతున్నారు. మహిళలు ఇంటికి వెళ్లిన తర్వాత వారికి ఇబ్బందులు కలగకుండా, అందరికీ ఇక్కడే సాయంత్రం పూట టిఫిన్లు కూడా ఏర్పాటు చేశారు. పూజ అనంతరం మహిళలకు పిల్లలకు ప్రత్యేకమైన గేమ్స్ ఏర్పాటు చేస్తున్నారు. వినాయక మండపం వద్ద పోలీసుల సూచనల మేరకు ప్రత్యేకంగా సీసీ కెమెరా ఏర్పాటు చేశారు.

### నిరంతర పర్యవేక్షణ

రోజూ వారి కార్య క్రమాలతో పాటు నిమజ్జనం ఏర్పాటులో మాధవ నగర్ కాలనీ కమిటీ అధ్యక్షుడు రాగం శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు దాది గారి గంగాధర్, గణేష్ కమిటీ సభ్యులు చకిలం సంతోష్ కుమార్, డాక్టర్ సంగమేశ్వర రెడ్డి, అలుగుల్ల శ్రీధర్, ఉప్పల భాను ప్రకాష్, సాంబయ్య గారి ప్రభాకర్, దాది గారి నరేష్, పెంటయ్య, చందు బట్ల (టెంట్ హౌస్) రాము, విశ్రాంత ఎస్ ఐ మొగులయ్య ముదిరాజ్, మిల్క్ సెంటర్ గంగారెడ్డి, మంగలి రాజు. తదితరులు సహాయ సహకారాలు అందిస్తున్నారు.

### రికార్డు స్థాయిలో ధర పలుకుతున్న లడ్డు వేలం

పట్టణం లోనే మిగిలిన అన్నీ వినాయక మండపం ల తో పోలిస్తే మాధవ్ నగర్ కాలనీ లోని వినాయక మండపం అన్నీ రంగాల్లో ముందంజ లో ఉందని చెప్ప వచ్చు. ఇక్కడ ప్రతి ఏడాది లడ్డు వేలం పాట లో ఔత్సాహికులు పోటీ పడి పాల్గొంటున్నారు. గతేడాది లక్షా 30 వేలు ధర పలికిన లడ్డు ఈ సారి 2 లక్షల వరకు పలుకుతుందని పలువురు అంచనా వేస్తున్నారు. మొన్న మామూలు రోజుల్లో నే లక్షా 36 వేల కు పైగా ధర పలికిన లడ్డు ఇక నిమజ్జనం రోజు ఇంకెంతకు వెళ్తుందో అని అందరూ ఉత్సాహం తో ఎదురు చూస్తున్నారు.

ఆకట్టుకున్న ఉట్టి కొట్టే కార్య క్రమం, ఇరుముడి సినిమాలు

ప్రతీ రోజు నిత్య పూజల అనంతరం చేపట్టే సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఎంతగానో అలరిస్తున్నాయి. మంగళ వారం నాడు ఉట్టి కొట్టే కార్య క్రమంలో యువకులు ఉత్సాహం తో పాల్గొన్నారు. అదే రోజు రాత్రి చిన్నారులు చేసిన భరతనాట్యం ఆహుతులను ఎంతో అలరించింది. బుధవారం నాడు రాత్రి పెద్ద స్క్రీన్ పై భక్తులకు ఇటీవల విడుదలై బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన *ఇరుముడి* సినిమా ప్రదర్శించారు.




### అందరి సహకారంతో గణేష్ ఉత్సవాలు
### మాధవ నగర్ కాలనీ అధ్యక్షులు రాగం శ్రీనివాస్

పెద్ద శంకరంపేట పట్టణంలోని మాధవ్ నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవాలు కాలనీలోని మహిళలు పిల్లలు, పెద్దల, సహకారంతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ ఏడాది కాలనీలో మొదటి సారి దుర్గామాత ఉత్సవాలు కూడా నిర్వహించాలని నిర్ణయించాం. ఈ దుర్గమ్మ ఉత్సవాల కు కూడా అందరూ ఇలాగే సహకరించాలని కోరుచున్నాము.



**1.వ రోజు**
ప్రతిష్ఠ కు సంబంధించిన పూజలు

**2వ రోజు**
ప్రతి ఇంటి నుంచి మంగళ హారతి తీసుక వచ్చి హారతులు ఇస్తారు.

**3వ రోజు**
చెప్పన్ బొగ్ (56) యాభై ఆర్ రకాల స్వీట్లు వినాయకుడికి నైవేద్యం గా సమర్పిస్తారు.

**4 వ రోజు**
వినాయకుడికి అన్ని రకాల కరగాయలతో, శాఖంబరి గా అలంకరించి పూజలు నిర్వహిస్తారు.

**5వ రోజు**
భక్తులకు అన్నదానం
6వరోజు వినాయకుడి ముందు చాకలేట్స్ ఓం,స్వస్తిక్, ఆకారం లో ఉంచి అందరికి పంచుతారు.

**7 వరోజు**
సామూహిక కుంకుమ ర్చనలు

**8వరోజు**
చిన్నారులు, పెద్దలు, మహిళలు అందరూ కలసి ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహిస్తారు.

**9వ రోజు**
వినాయకుడి వద్ద భజనలు..కీర్తనలు...

**10 వ రోజు**
కాలనీ లోని అందరికి గేమ్స్.. ఆటల.. పాటల పోటీలు నర్వహిస్తారు..

**11వ రోజు**
నిమజ్జనం.. కాలనీ లోని అందరూ చిన్నారులు కలిసి సామూహికంగా స్వామివారికి పూజలు నిర్వహించి లడ్డు వేలం పాట పాడి నిమజ్జనం చేస్తారు.







# రామాయంపేటలో గణనాథుల సందడి

**మండపాల వద్ద ఇరుముడి సినిమా ప్రదర్శన.**

**కెసిఆర్ కాలనీలో సనాతన యూత్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు..**

**మున్సిపల్ కౌన్సిలర్లకు సన్మానం.**

రామాయంపేట, సెప్టెంబర్ 23 (సిరి న్యూస్): గణేష్ నవరాత్రి ఉత్సవాలు రామాయంపేట ఉమ్మడి మండలములో ఘనంగా జరుగుతున్నాయి. నిజాంపేట రామాయంపేట మండలాల్లోని అన్ని గ్రామాల్లో భక్తిశ్రద్ధలతో సందడిగా మారింది. మంగళవారం రాత్రి రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న కేసీఆర్ కాలనీలో సనాతన యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్టించిన వినాయకుడి మండపాన్ని స్థానిక మున్సిపల్ పాలక వర్గం సభ్యులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ కౌన్సిలర్ లు గజవాడ నాగరాజు గుప్తా, రవి, పుట్టి సందీప్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎనిశెట్టి అశోక్ గుప్తా, బైరం కుమార్, డాకి స్వామి లను కాలనీవాసులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేసిఆర్ కాలనీ ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బుధవారం రాత్రి కేసీఆర్ కాలనీలో గణేష్ నిమజ్జనం ఘనంగా జరిగింది. రెండు మండలాల పరిధిలో భారీ స్థాయిలో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక మండపాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమాలను నిర్వహిస్తూ భక్తులకు ప్రసాద వితరణ చేస్తున్నారు. ఈ కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, ప్రముఖులను ఆహ్వానిస్తూ ఉత్సవ కమిటీలు ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత పెంచుతున్నాయి. గణేష్ ఉత్సవాల సందర్భంగా ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు వినాయక మండపాల సందర్శనలో నిత్యం బిజీబిజీగా కనిపిస్తున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ గ్రామాలు, కాలనీల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శిస్తూ ప్రత్యేక పూజల్లో పాల్గొంటున్నారు. నిర్వాహకులు నాయకులకు ఘన స్వాగతం పలుకుతూ శాలువాలతో సత్కరిస్తున్నారు. మండపాల వద్ద ఇటీవల ప్రేక్షకుల ఆదరణ పొందిన ఇరుముడి సినిమాను ప్రదర్శిస్తున్నారు. వినాయకుడి పూజలు కాగానే రాత్రి సమయంలో ఈ సినిమా ప్రదర్శన కొనసాగుతుంది.



## అమీన్ పూర్ క్రిష్ణ బృందావన్ కాలనీలో రికార్డు స్థాయిలో లడ్డు వేలం

**అమీన్‌పూర్, సెప్టెంబర్ 23 (సిరిన్యూస్) :** అమీన్ పూర్ సర్కిల్ పరిధి బంధం కొమ్ము క్రిష్ణ బృందావన్ కాలనీ విజయ గణపతి ఆలయం వద్ద జరిగిన 2026 సంవత్సవరంకు గణపతి లడ్డు 5,01,116 రూపాయలకు మడపు ఫామ్స్ అధినేతలు మడపు రోహిత్ రెడ్డి, రాహుల్ రెడ్డి లు కైవసం చేసుకున్నారు. క్రిష్ణ బృందావన్ కాలనీ విజయ గణపతి ఆలయంలో కోరిన కోరికలు తీరుతాయని, ఎంతో పవిత్రమైన లడ్డును సొంతం చేసుకోవడం అదృష్టంగా ఉందని, కెబిసి కాలనీవాసులు తమ కుటుంబంతో సమానమని విజేతలు రోహిత్ రెడ్డి, రాహుల్ రెడ్డి అన్నారు. ఈ వేలం కార్యక్రమంలో కెబిసి కాలనీ పాలకవర్గం ప్రవీణ్ రెడ్డి, ఉదయ్ రెడ్డి, యోగేందర్ రెడ్డి, త్రినాథ్ బాబు, శరత్ రెడ్డి, రేవంత్ పాటు ఆలయ కమిటీ సభ్యులు తుమ్మల బలరాం రెడ్డి, సత్య రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.





# వెల్ డన్ యాదగిరి!

**జర్నలిస్టుల రక్తదాన శిబిరం గ్రేట్**

**అభినందించిన జిల్లా కలెక్టర్ శాలువాతో సత్కారం...**

**ప్రశంసాపత్రం అందజేత**

**సంగారెడ్డి, సెప్టెంబర్ 23 (సిరిన్యూస్):**వెల్ డన్ యాదగిరి.. గుడ్ జాబ్ అని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అభినందించారు. నేనే మీకు శాలువా కప్పాలి అం టూ శాలువాతో సత్కరించారు. రక్తదాన శిబిరానికి సంబంధించిన ప్రశంసా పత్రాన్ని యాదగిరి కి అందజేశారు. తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి జన్మదిన పురస్కరించుకొని మంగళవారం పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన సంగతి తెలిసిందే. అయితే ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొనాల్సి ఉండగా అత్యవసర పనుల వల్ల ఆయన పాల్గొనలేక పోయారు. దీంతో బుధవారం నాడు జర్నలిస్ట్ యూనియన్ నాయకుడు బండారు యాదగిరి ఆధ్వర్యంలో జర్నలిస్టులు కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ ను కలిశారు. నోట్ పుస్తకాలను అందించారు. రక్తదాన శిబిరం ద్వారా సమాజానికి సేవా నిరతి ని చాటి చెప్పడం గ్రేట్ అని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా సమాజానికి మంచి మెసేజ్ వెళుతుందని అన్నారు. పుట్టినరోజునాడు కేక్ కటింగ్ తో వేడుకలు జరపకుండా రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమని అన్నారు. నిత్యం సమాజంలోని వార్తలను వెలికి తీస్తున్న జర్నలిస్టుల ద్వారా ఇలాంటి కార్యక్రమాలు జరగడం మరింత శుభ సూచకమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు తమ వంతుగా సమాజానికి ఎంతో కొంత సేవ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా బండారు యాదగిరి మాట్లాడుతూ తమ యూనియన్ మొదటి నుంచి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించిందని చెప్పారు. రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఎ కే పైసల్ ఆధ్వర్యంలో జర్నలిస్టుల హక్కులను సాధించడానికి అనేక పోరాటాలు చేశామని వివరించారు. మన్మందు కూడా తమవంతుగా సామాజిక సేవలో పాల్గొంటామని ఈ సందర్భంగా యాదగిరి పేర్కొన్నారు. జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి (డిపిఆర్ఓ) విజయలక్ష్మి కూడా ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు యాదగిరిని అభినందించారు. రక్తదానం ద్వారా ప్రమాదంలో ఉన్న వారికి మేలు కలుగుతుందన్నారు. సామాజిక బాధ్యతగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం మంచిదన్నారు. జిల్లా అక్రిడేషన్ కమిటీ సభ్యుడు ప్రభాకర్, చిన్నా మధ్యతరగతి పత్రికల సంఘం ఉపాధ్యక్షుడు నజీర్, కోశాధికారి లక్ష్మణ్, రథసారథి సీఈవో సంతోష్ గౌడ్, ఆంధ్రజ్యోతి శ్రీకాంత్, టీయూడబ్ల్యూజే ఐజేయు జిల్లా కార్యవర్గ సభ్యులు ఇర్షాన్, విజయ రాజు, మహేష్, శ్రీకాంత్, సాక్ష్యం శ్రీనివాస్, నవీన్,యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# హత్నూరలో ఐటీ సోదాలు

**హత్నూర, సెప్టెంబర్ 23:** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం చందాపూర్ గ్రామ శివారులోని వీఎస్‌పీ ఇస్పాత్ ప్రైవేట్ లిమిటెడ్ స్టీల్ పరిశ్రమలో బుధవారం ఆదాయపన్ను (ఐటీ) శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఉదయం 5 గంటల ప్రాంతంలోనే పరిశ్రమలోకి ప్రవేశించిన అధికారులు, అక్కడి పలు కీలక రికార్డులు, డాక్యుమెంట్లను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఈ తనిఖీలు ఏ అంశానికి సంబంధించి నిర్వహిస్తున్నారనే వివరాలు ఐటీ అధికారుల నుంచి ఇంకా వెల్లడికావాల్సి ఉంది. సోదాలు పూర్తయిన తర్వాతే పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. ఉదయం నుంచి తనిఖీలు కొనసాగుతుండటంతో పరిశ్రమ పరిసర ప్రాంతాల్లో ఆసక్తి నెలకొంది.







# ప్రజా సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తేవాలి

- ‘సిరి’ సామాన్యుల గొంతుక కావాలి
- ప్రజలకు, ప్రభుత్వ యంత్రాంగానికి మధ్య మీడియా బలమైన వారధి
- సంగారెడ్డి ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్న సిరి యాజమాన్యానికి అభినందనలు
- ‘సిరి టీవీ’ ఛానల్ మరియు సిరి మీడియా హౌస్ సందర్శన

### జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్యరావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ సీడీసీ చైర్మన్ బుచ్చిరెడ్డి

**సంగారెడ్డి, సెప్టెంబర్ 23 (సిరి న్యూస్):** సంగారెడ్డి పట్టణంలో నూతనంగా ప్రారంభమై ప్రజల ఆదరాభిమానాలను చూరగొంటున్న ‘సిరి టీవీ’ ఛానల్ మరియు సిరి మీడియా హౌస్ ప్రధాన కార్యాలయాన్ని బుధవారం జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్యరావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, సంగారెడ్డి జిల్లా సీడీసీ మాజీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఛానల్ నిర్వాహకులు, సంపాదక వర్గం మరియు సిబ్బంది వారికి ఘనంగా స్వాగతం పలికారు. నూతన కార్యాలయ ప్రాంగణాన్ని పూర్తిగా పరిశీలించిన ప్రముఖులు ఛానల్ ప్రసారాలు, అత్యాధునిక టెక్నికల్ విభాగాలు, భవిష్యత్ వార్తా ప్రణాళికలు మరియు ప్రజలకు అందించనున్న సేవలను గురించి వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో మీడియా అనేది సమాజానికి ఒక కన్ను లాంటిదని, ప్రత్యేకించి ‘సిరి టీవీ’ ఎప్పుడూ నిరుపేదల, సామాన్యుల గొంతుకగా నిలవాలని ఆకాంక్షించారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న అనేక ప్రజా సమస్యలను నిర్భయంగా, నిర్మొహమాటంగా వెలుగులోకి తీసుకురావడంతో పాటు, ఎలాంటి రాజకీయ పక్షపాత ధోరణి లేకుండా కేవలం వాస్తవాలను మాత్రమే యథాతథంగా ప్రజలకు చేరవేయాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలకు, ప్రభుత్వ యంత్రాంగానికి, అధికారులకు మధ్య మీడియా ఒక బలమైన వారధిలా పనిచేసినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యపడుతుందని హితవు పలికారు. సంగారెడ్డి ప్రాంత ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నిత్యం ప్రజా సమస్యల పరిష్కారానికి, స్థానిక అభివృద్ధికి కృషి చేస్తున్న సిరి మీడియా యాజమాన్యాన్ని, సిబ్బందిని వారు ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే రోజుల్లో సిరి టీవీ మరిన్ని మైలురాళ్లను అధిగమించి, ప్రజల నమ్మకమైన వార్తా వేదికగా, నంబర్ వన్ ఛానల్‌గా ఎదగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిరి మీడియా హౌస్ ప్రతినిధులు, వివిధ విభాగాల జర్నలిస్టులు, సిబ్బంది, స్థానిక ప్రముఖులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని సందడి చేశారు.




# పెండింగ్ అభివృద్ధి పనులు పూర్తి చేసేలా ఆదేశించాలి



- దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయించాలి
- ప్రహరీ గోడలు లేని పాఠశాలలకు రక్షణ గోడలు నిర్మించాలి
- కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేసిన సంగారెడ్డి, జహీరాబాద్ ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్ రావు

**సంగారెడ్డి, సెప్టెంబర్ 23 (సిరి న్యూస్):** సంగారెడ్డి, జహీరాబాద్ నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, మౌలిక వసతుల కల్పనపై సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గాల అభివృద్ధికి సంబంధించి పలు కీలక అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. చేర్యాల గ్రామంలో కుల సంఘాలకు సంబంధించిన స్థలాలను ఆయా సంఘాలకే కేటాయించాలని, టీజీ ఐఐసీ పేరుతో ఆ స్థలాలను ఇతర అవసరాలకు తీసుకునే ప్రయత్నాలు జరగకుండా కట్టడి చేయాలని కోరారు. నియోజకవర్గాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో తగిన చర్యలు చేపట్టాలని, గ్రామీణ ప్రాంతాల్లో డ్రైనేజీలు, మురుగు కాలువలు, కల్వర్టులు, అంతర్గత రోడ్ల సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అవసరమైన ప్రాంతాల్లో ఎస్సీ కమ్యూనిటీ హాళ్లను మంజూరు చేసి వెంటనే నిర్మాణ పనులు చేపట్టాలని, అలాగే అంబేద్కర్ భవనాల నిర్మాణానికి అవసరమైన నిధులు, స్థలాలను కేటాయించి మంజూరు చేయాలని కోరారు. సైదాపూర్ తండాలో వాటర్ ట్యాంక్‌కు వెళ్లే మెట్లు పూర్తిగా దెబ్బతిన్నందున తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, నియోజకవర్గంలోని ఇతర గ్రామాల్లోనూ ఇలాంటి సమస్యలను గుర్తించి కొత్త మెట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. టీజీ ఐఐసీ ద్వారా భూసేకరణ జరుగుతున్న గ్రామాల్లో పారిశ్రామిక అవసరాలతో పాటు, గ్రామాల కనీస మౌలిక అవసరాల కోసం కూడా తగిన భూమిని కేటాయించాలని కోరారు. వర్షాకాలం నేపథ్యంలో రోడ్ల పరిస్థితిపై ప్రత్యేక దృష్టి సారించి దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, ప్రహరీ గోడలు లేని ప్రభుత్వ పాఠశాలలను గుర్తించి రక్షణ గోడలు మంజూరు చేయాలని కోరారు. ప్రజలకు అత్యవసరంగా అవసరమైన తాగునీరు, విద్య, రహదారులు, పారిశుధ్యం తదితర మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యేలు కోరారు. ఇప్పటికే మంజూరై పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై శాఖల వారీగా సమీక్షించి, త్వరగా పూర్తి చేసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.







# అభివృద్ధికి ఆమడ దూరం!

## విలీనం వద్దన్నా వినలేదు...అభివృద్ధి ఊసే లేదు

## విలీన గ్రామాల్లో కానరాని పనులు

### 10వ వార్డు వెంకటాపూర్ ప్రజల అవస్థలు

## బ్రాహ్మణపల్లి పంచాయతీ విలీనంపై అభ్యంతరాలను పట్టించుకోలేదు

(బుచ్చిరెడ్డి జనార్ధన్‌రెడ్డి)

**తూప్రాన్, సెప్టెంబర్ 23 (సిరిన్యూస్):**

**తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని 10వ వార్డు వెంకటాపూర్ వెంకటపట్నంలో అభివృద్ధి నోచుకోక గత 13 సంవత్సరాలుగా ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. రాజకీయ నాయకుల స్వార్థంతో అభివృద్ధికి నోచుకోకపోవడం గ్రూపు రాజకీయాలతో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వెంటనే డ్రైనేజీలు, సిసి రోడ్లు ఏర్పాట్లు చేయాలని, లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని అదేవిధంగా ధర్నాలకు కూడా పూనుకుంటామని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.**

తూప్రాన్ మున్సిపాలిటీగా ఏర్పడే సమయంలో బ్రాహ్మణపల్లి గ్రామ పంచాయతీని మున్సిపాలిటీలో విలీనం చేయవద్దని గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ తమ అభ్యంతరాలను పట్టించుకోకుండా విలీనం చేశారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీలో విలీనం చేసిన తర్వాత గ్రామానికి ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మౌలిక వసతులు, డ్రైనేజీ, సీసి రోడ్లు, పారిశుధ్యం, తాగునీరు వంటి సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విలీనం ముందు ఒక మాట తర్వాత నిధులు లేవనడం విడ్డూరంగా ఉందంటున్నారు. మున్సిపాలిటీలో విలీనం అయితే గ్రామానికి కేంద్రం నుండి మరిన్ని నిధులు వస్తాయని అభివృద్ధి వేగవంతమవుతుందని చెప్పారని, అయితే విలీనం జరిగిన తర్వాత కూడా తమ గ్రామంలో ఆశించిన మార్పు కనిపించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.








**ప్రజల అభ్యంతరాలను ఎందుకు పట్టించుకోలేదు**

విలీన సమయంలో గ్రామస్థుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాల్సి ఉండగా తమ వ్యతిరేకతను పట్టించుకోకుండా నిర్ణయం తీసుకున్నారని స్థానికులు నిలదీస్తున్నారు. అప్పట్లో విలీనాన్ని సమర్థించిన నాయకులు, అధికారులు ఇప్పుడు గ్రామ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని కోరుతున్నారు. పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ, సిసి రోడ్లు, అభివృద్ధి పనులను పూర్తి చేయాలని వెంకటపట్నం ప్రజలు కోరుతున్నారు. మున్సిపాలిటీలో విలీనం చూపించిన శ్రద్ధ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంలో చూపించాలని డిమాండ్ చేస్తున్నారు. గ్రామపంచాయతీగా ఉంటే కనీసం వెంకట పట్నంలో వచ్చే ఆదాయంతోనైనా అభివృద్ధి చేసుకునే వాళ్ళమని, అలాంటిది విలీనంతో ఎలాంటి అభివృద్ధి లేక ఇబ్బందులకు గురవడం చాలా బాధాకరమని, విలీనం తర్వాత కౌన్సిలర్ అనే ఒక పదవి తప్ప ఎలాంటి రాజకీయ పదవులు నోచుకోకపోవడం చాలా బాధాకరమని వాపోయారు. గ్రామ పంచాయతీగా ఉంటే సర్పంచ్ పదవి, ఉపసర్పంచ్, వార్డ్ మెంబర్లు, ఎంపీటీసీ, ఎంపీపీ ఇలాంటి పదవులు పొందే అవకాశం ఉండేదని స్వార్థ రాజకీయాలతో ఆ అవకాశాలను లేకుండా చేశారని యువత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

